12-02-2025
బుధవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 149 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి




# ప్రపంచంలో 21వ శతాబ్దం భారత్‌దే..

## వనరులు, మేధో సంపత్తి, ఆర్థిక బలం, రాజకీయ స్థిరత్వం, ప్రపంచ సుస్థిరతపై భారత్‌కు నిబద్ధత.. ప్రధాని నరేంద్ర మోడీ

**జయభేరి, న్యూ ఢిల్లీ, ఫిబ్రవరి 11 :**

శిలాజేతర ఇంధన శక్తి ఉపయోగించడంతో భారత దేశం మూడు రెట్లు పెరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. వివరించారు. సౌర ఉత్పత్తిని సామర్థ్యాన్ని డబుల్ చేసి మూడో అతిపెద్ద సౌరశక్తిని ఉత్పత్తి చేసే దేశంగా భారత్ నిలిచిందని మెచ్చుకున్నారు. భారత్ ఇంధన వార్షికోత్సవాలు 2025ను ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న పిఎం మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండియా తన వృద్ధిని సాధించడంతో పాటు ప్రపంచ వృద్ధి రేటును నడిపిస్తోందని ప్రశంసించారు. ఇంధన రంగంలో భారత్ ప్రధాన పాత్ర పోషిస్తుందని ప్రశంసించారు.
21వ శతాబ్దం భారత్‌దేనని ప్రపంచంలోని నిపుణులు చెబుతున్నారని, వనరులు, మేధో సంపత్తి, ఆర్థిక బలం, రాజకీయ స్థిరత్వం, ప్రపంచ సుస్థిరతపై భారత్‌కు నిబద్ధత ఉందని మోడీ స్పష్టం చేశారు. 2030 సంవత్సరం నాటికి జీరో కర్బన ఉద్గార లక్ష్యాన్ని పెట్టుకున్నామని, ప్రతి సంవత్సరం ఐదు మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామన్నారు. పారిస్ జి20 ఒప్పంద లక్ష్యాలను చేరుకున్న తొలి దేశం భారతేనని, రానున్న రెండు దశాబ్దాలు భారత దేశానికి అత్యంత కీలకమని ఆయన తెలియజేశారు.
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యాక్షన్ కమిటీ సమావేశానికి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్, పిఎం మోడీ అధ్యక్షత వహిస్తున్నారు. ఫ్రాన్స్ పర్యటన అనంతరం మోడీ అమెరికాలో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మోడీ సమావేశం కానున్నారు.

# స్టాక్ మార్కెట్ క్రాష్

**దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో దేశీయ మార్కెట్లు వరుసగా నాలుగో రోజు నష్టాలు చవిచూశాయి. దలాల్ స్ట్రీట్ స్టాక్ మార్కెట్ 5 రోజుల్లో తన మెరుపును పూర్తిగా కోల్పోయింది. సెన్సెక్స్, నిఫ్టీ రెండూ 3 శాతానికి పైగా క్షీణించాయి. మంగళవారం రెండు సూచీలు ఒకటిన్నర శాతం క్షీణతను చవి చూశాయి. మంగళవారం మార్కెట్ ముగిసేలోపు పెట్టుబడిదారులు రూ.10 లక్షల కోట్లు, ఫిబ్రవరి 4 నుండి రూ.17.76 లక్షల కోట్లకు పైగా నష్టపోయారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, స్టాక్ మార్కెట్లో ఈ క్షీణత జనవరిలో కంటే ఎక్కువగా కనిపించింది.**



**జయభేరి, ముంబై, ఫిబ్రవరి 11 :**

ఫిబ్రవరి నెలలో సగం కూడా గడిచిపోలేదు. ఇప్పటికే 2,400 పాయింట్లకు పైగా క్షీణత కనిపించింది.ఇప్పుడు అతిపెద్ద ప్రశ్న ఏమిటంటే స్టాక్ మార్కెట్లో ఈ క్షీణత ఎందుకు కనిపిస్తోంది? కాబట్టి దీనికి సమాధానం ట్రంప్ బెదిరింపులే అంటున్నారు ఆర్థిక నిపుణులు. ట్రంప్ మొత్తం ప్రపంచానికి సుంకాల భయాన్ని చూపించి భయపెడుతున్నారు. దీని ప్రభావం ప్రపంచ స్టాక్ మార్కెట్లపై స్పష్టంగా కనిపిస్తోంది. భారతదేశం కూడా దీనికి అతీతం కాదు. ట్రంప్ ఇటీవల స్టీల్, అల్యూమినియంపై 25 శాతం అదనపు సుంకాన్ని విధిస్తున్నట్లు ప్రకటించారు. దీని కారణంగా స్టాక్ మార్కెట్ వేగంగా క్రిందికి కదులుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, స్టాక్ మార్కెట్ నరేంద్ర మోదీ, ట్రంప్ మధ్య సమావేశంపై కన్నేసి ఉంచుతుంది. దానిలో ఎలాంటి విషయాలు బయటకు వస్తాయి? ఆ తరువాత, స్టాక్ మార్కెట్ కదలికలో కొంత మార్పు సాధ్యమే అనిపిస్తుంది..!మంగళవారం స్టాక్ మార్కెట్లో భారీ క్షీణత కనిపిస్తోంది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ కీలక సూచీ సెన్సెక్స్ ట్రేడింగ్ సెషన్‌లో 1,281.21 పాయింట్లు పడిపోయి, ఒక రోజు కనిష్టస్థాయి 76,030.59 పాయింట్లకు చేరుకుంది. కాగా, ఒక రోజు ముందు సెన్సెక్స్ 77,311.80 పాయింట్ల వద్ద ముగిసింది. ప్రస్తుతం, అంటే మధ్యాహ్నం 2.15 గంటలకు, 1,116 పాయింట్ల క్షీణతతో 76,195.89 వద్ద ట్రేడవుతోంది.ప్రత్యేకత ఏమిటంటే ఫిబ్రవరి 4 నుండి స్టాక్ మార్కెట్

...మిగతాది 2 లో




# ఇన్ని సవాళ్లు ఎదుర్కోవడం ఇదే తొలిసారి

**జయభేరి, విజయవాడ, ఫిబ్రవరి 11:**

ఈఆఫీసులో ఫైళ్ల క్లియరెన్సు ప్రక్రియ వేగవంతం చేయాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మంత్రులు, కార్యదర్శుల సదస్సులో భాగంగా వివిధ శాఖల్లో ఈఆఫీసు ఫైళ్ల క్లియరెన్సు జరుగుతున్న క్రమం గురించి ఆర్టీజీఎస్ సీఈఓ కె. దినేష్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రేపటికి తాను ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి 8 నెలలు పూర్తవుతోంది. మనపై విశ్వాసం ఉంచి, ఐదేళ్ల వైసీపీ పరిపాలనను ప్రజలు అంగీకరించలేదు.

...మిగతాది 2 లో



# బర్డ్ ఫ్లూ కలకలం

**జయభేరి, అమరావతి ఫిబ్రవరి 11:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ కలకలం సృష్టిస్తుంది. కానూరులోని ఓ పౌల్ట్రీలో బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో జిల్లా అధికారులు అప్రమత్తం కావడంతో పాటు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. నెల రోజులుగా పౌల్ట్రీల్లో కోళ్ల మృత్యువాత పడుతున్నాయని అధికారులు గుర్తించారు. వెంటనే చికెన్ అమ్మకాలు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. పౌల్ట్రీల పరిధిలో సెక్షన్ 144 అమలులోకి వచ్చింది. వేల్పూరులోని పౌల్ట్రీలో బర్డ్‌ఫ్లూ నిర్ధారణ కావడంతో మాంసం దుకాణాలకు అధికారులు నోటీసులు జారీ చేశారు. మరో రెండు రోజుల్లో శాంపిల్స్ ఫలితాలు రానున్నాయి.బర్డ్‌ఫ్లూపై ఎలాంటి ఆందోళన చెందవద్దు పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు తెలిపారు. కేంద్రం ఆదేశాల మేరకు నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నామన్నారు. నష్టపోయిన పౌల్ట్రీ రైతులకు పరిహారం అందిస్తామని దామోదర్‌నాయుడు స్పష్టం చేశారు.

# రేవంత్ కు సోదరుడిలా ఉంటా..




**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 11**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను వ్యతిరేకిస్తున్న మందకృష్ణ మాదిగ అభిమానాన్ని సంపాదించుకున్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమిట్ మెంట్ ను మందకృష్ణ మాదిగ అభినందించారు. ఒక కమిట్ మెంట్ తో వర్గీకరణ ప్రక్రియను చేపట్టిన ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి గారికి ఒక సోదరుడిగా అండగా ఉంటానన్న మందకృష్ణ మాదిగ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డిని మందకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా ఉపకులాల వర్గీకరణలో పలు సమస్యలను సీఎంకు వివరించారు. రాజకీయ ప్రయోజనాలకు అతీతంగా, మాదిగ, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఉందని సీఎం రేవంత్ రెడ్డి మందకృష్ణకు తెలిపారు. అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీ వేసి, న్యాయ కమిషన్ వేసి, నివేదికలను వేగంగా తీసుకుని, కేబినెట్ లో చర్చించి, అసెంబ్లీలోనే నిర్ణయం తీసుకున్నామని

...మిగతాది 2 లో

# ప్రజలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నది

# సౌత్ ను కూడగడుతున్న రేవంత్



jayabheridaily.com

# సౌత్ ను కూడగడుతున్న రేవంత్

**దేశవ్యాప్తంగా రాజకీయ పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి. అంతర్జాతీయంగా భారత పరపతి పెరుగుతున్నప్పటికీ.. స్వదేశంలోనే వివక్ష రాజ్యమేలుతోంది. 'సొమ్మొకడిది సోకకడిది' అన్నట్లు.. దక్షిణాది రాష్ట్రాల నుండి అధికంగా లాభాలు పొందుతున్న కేంద్ర ప్రభుత్వం.. కేటాయింపుల్లో మాత్రం ఈ రాష్ట్రాలకు మొండి చేయి చూపిస్తోంది. అంతేకాదు, దేశం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ఎంతో త్యాగం చేసిన దక్షిణ భారతదేశంలో ఇప్పుడు జనాభా క్షీణిస్తోంది.**



ఇది, రాజకీయ ప్రాతినిధ్యంలోనూ దక్షిణాదికి నష్టం తెచ్చేలా ఉంది. జనాభా ఆధారంగా పార్లమెంటరీ సీట్ల పునర్విభజన గురించి కూడా రేవంత్ ఆందోళన వ్యక్తం చేశారు. కుటుంబ నియంత్రణ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు ఇప్పుడు ప్రతికూల స్థితిలో ఉన్నాయి. అలాంటిది, జనాభా ప్రాతిపదికన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టి దక్షిణాదిని శిక్షించడానికి కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందన్నది రేవంత్ వ్యాఖ్యల్లో తెలుస్తోంది.తెలంగాణ లాంటి ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రాలకు.. ముఖ్యంగా, దక్షిణాది రాష్ట్రాలకు.. బిజెపి పాలనలో లేని రాష్ట్రాలకు.. కేంద్ర బిజెపి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి అడుగుతున్న పశ్న. తెలంగాణ $1 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థను సాధించడం కారణంగా.. మొత్తం దేశానికి ప్రయోజనం చేకూరుతుందనే వాదన మధ్య.. ఈ ప్రయత్నంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం సహకరించకపోవడం కుట్రలో భాగంగానే చూడాల్సి వస్తుంది. ఇలా, కేంద్ర విధానాలకు సంబంధించి దక్షిణాదిలో పెరుగుతున్న ఆందోళనలపై ఇటీవల కాలంలో దక్షిణాది రాష్ట్రాలు చర్చిస్తూనే ఉన్నాయి. ఇప్పుడు, రేవంత్ వ్యాఖ్యల తర్వాత.. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి.. వాటి మధ్య ఎక్కువ స్వయంప్రతిపత్తి, సహకారం ఉండాలనే పిలుపు వస్తోంది.నిజానికి, జనాభా ప్రకారం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన జరిగితే.. దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తగ్గుతాయి. దీని వల్ల, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో గెలిచే సీట్లతోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరమే పార్టీలకు ఉండదు. అందుకే, జనాభా లెక్కల ప్రకారం కాకుండా.. ప్రతి రాష్ట్రానికీ 50% సీట్లు పెంచాలని సీఎం రేవంత్ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్, డైరెక్ట్‌గా ప్రధాని మోడీతోనే డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. నిజానికి, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు ఎప్పటి నుండో నివేదికలు వెలువడుతున్నాయి దక్షిణాది రాష్ట్రాల్లో నియోజవర్గాలు తగ్గుతాయనే ఆందోళన పెరిగింది. నియోజకవర్గాల పునర్విభజన కారణంగా, దక్షిణాదితో పోలిస్తే ఎక్కువ లోక్‌సభ స్థానాలు, ఎక్కువ జనాభా ఉన్న ఉత్తర భారత రాష్ట్రాలకు వెళతాయి. అది ఉత్తరాదికి రాజకీయ ప్రయోజనాన్ని ఇస్తుంది. ఇక, కొత్త జనగణన తర్వాత జరగాల్సిన డీలిమిటేషన్ ప్రక్రియ, లోక్‌సభ నియోజకవర్గాలు తక్కువగా ఉండటం వల్ల జాతీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాష్ట్రాల ప్రభావం తగ్గిపోతుందనే భయం బలంగా ఉంది. అందుకే, దక్షిణాది రాష్ట్రాల సీఎంలైన ఏపీ సీఎం చంద్రబాబు, తమిళనాడు సీఎం స్టాలిన్ ఇటీవల కాలంలో పిల్లల్ని ఎక్కువగా కనాలని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఇద్దరు సీఎంలు చేసిన విజ్ఞప్తులకు కర్ణాటక, తెలంగాణ, కేరళల నుండి కూడా మద్దతు

**కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి దక్షిణాది రాష్ట్రాలపై ఆధారపడాల్సిన అవసరమే పార్టీలకు ఉండదు. అందుకే, జనాభా లెక్కల ప్రకారం కాకుండా.. ప్రతి రాష్ట్రానికీ 50%సీట్లు పెంచాలని సీఎం రేవంత్ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్, డైరెక్ట్‌గా ప్రధాని మోడీతోనే డిస్కస్ చేసినట్లు తెలుస్తోంది. నిజానికి, జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేయాలని కేంద్రం ఆలోచిస్తున్నట్లు ఎప్పటి నుండో నివేదికలు వెలువడుతున్నాయి దక్షిణాది రాష్ట్రాల్లో నియోజవర్గాలు తగ్గుతాయనే ఆందోళన పెరిగింది.**


లభించింది. దక్షిణాది రాష్ట్రాలు ఇప్పటికే పార్లమెంటులో... కేంద్ర నిధుల పంపిణీలో జనాభా సంఖ్యల ఆధారంగా ఇచ్చే పక్షపాత ధోరణిని విమర్శిస్తున్నాయి. అందుకే, జనాభాను పెంచే లక్ష్యంతో దక్షిణాది రాష్ట్రాలు సమర్థవంతంగా పనిచేయడానికి చర్యలు కూడా తీసుకుంటున్నాయి. భారతదేశంలో వృద్ధాప్య జనాభా పెరగడం, సంతానోత్పత్తి రేటు తగ్గిపోవడాన్ని ఇటీవలి డేటా స్పష్టం చేస్తోంది. దీని ప్రకారం, 2050 నాటికి, ప్రతి ఐదుగురిలో ఒకరు 60 ఏళ్లు పైబడి ఉంటారని తెలుస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో అయితే ఇది మరింత ఎక్కువగా జరుగుతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి.సంవత్సరాలుగా, దక్షిణాది రాష్ట్రాలు వారి మొత్తం సంతానోత్పత్తి రేటు క్రమంగా తగ్గిపోతున్నట్లు గమనించాయి. ఇది సాధారణ స్థాయి కంటే మరింత దిగువకు పడిపోవడంతో ఆందోళనలు పెరుగుతున్నాయి. సంతానోత్పత్తి జాతీయ సగటు రేటు 2.0 కాగా, తెలంగాణలో అది 1.8 గా ఉంది. అదే ఆంధ్రప్రదేశ్‌లో అది 1.7గా ఉంది. ఇక, దక్షిణాది రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 1.6 వద్ద జాతీయ సగటు 2 కంటే కొంచెం తక్కువగా ఉంది. సంతానోత్పత్తి రేటు 1.8 కంటే తక్కువగా ఉంటే సంబంధిత దేశ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల మీద ప్రభావం చూపుతుందని ముంబయ్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పాపులేషన్ సైన్సెస్ కూడా చెబుతోంది.15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసిన స్థాయిలతో పోల్చితే గత కొన్నేళ్లుగా రాష్ట్రాలకు ఇచ్చిన డెవల్యూషన్ చాలా తక్కువగా ఉందని దక్షిణాది రాష్ట్రాలు ఎప్పుడూ ఫిర్యాదు చేస్తూనే ఉన్నాయి. అలాగే, తక్కువ జనాభా, ఆర్థికంగా బలమైన దక్షిణాది రాష్ట్రాలకు అధికార వికేంద్రీకరణలో కూడా వాటా తక్కువగా ఉంది. అయితే, ఈ కొలమానాల్లో బలహీనంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలు కేంద్ర పన్నుల్లో ఎక్కువ వాటాను పొందుతాయి. నిజానికి, దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న19.6% జనాభా నుండి దేశానికి 30% కంటే ఎక్కువ GDPతో గణనీయమైన సహకారం అందిస్తున్నారు.దక్షిణాది రాష్ట్రాలు 11వ ఆర్థిక సంఘం కింద 21% వాటా కేటాయిస్తే.. అది, 15వ ఆర్థిక సంఘం కింద కేవలం 15.8%కి పన్ను పంపిణీలో తమ వాటాను తగ్గించాయి. ఇది, 2011 జనాభా లెక్కల ఆధారంగా జరగడం వల్ల దక్షిణాది రాష్ట్రాలు సెంట్రల్ పూల్‌లో తమ ఆదాయ వాటాను కోల్పోయాయి. కాబట్టి, లోక్‌సభ స్థానాల విభజనపై ఉన్న సందేహాలను కేంద్రం పరిష్కరించాలనే డిమాండ్లు వస్తున్నాయి దక్షిణ భారత రాష్ట్రాలు కుటుంబ నియంత్రణ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాయి. జనన నియంత్రణ చర్యల నుండి మహిళలకు విద్య అందించడం వరకు, జనాభా స్థిరీకరణలో దక్షిణ భారత రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. పని చేసే వయస్సున్న జనాభా తగ్గిపోవడం వల్ల... ఆర్థిక వ్యవస్థలో సహకరించే వారి సంఖ్య తగ్గిపోతుంది. పెన్షనర్లు, ఆరోగ్య భద్రత అవసరమయ్యే వృద్ధుల నిష్పత్తి పెరుగుతూ... యువత తగ్గిపోతే ఇది కుటుంబాలపై, ప్రభుత్వాలపై ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తుంది. ఉత్తర భారత రాష్ట్రాలు తమ జనాభాను నియంత్రించడానికి ఏమీ చేయట్లేదన్నది నివేదికలు చెబుతున్న మాట. కానీ, కుటుంబ నియంత్రణ చర్యలను అమలు చేసినందుకు దక్షిణాది రాష్ట్రాలకు ఇప్పుడు సమస్యలు వస్తున్నాయి. ఇక, మోడీ ప్రభుత్వం చెబుతున్నట్లు నియోజకవర్గాల పునర్విభజన జనాభా ప్రాతిపదికనే జరిగితే... దక్షిణాది రాష్ట్రాలు అటు ఆర్థికంగానూ.. ఇటు రాజకీయంగానూ.. తీవ్రమైన నష్టం ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే, కేరళ, తమిళనాడు, కర్నాటక, ఏపీ, తెలంగాణతో పాటు.. పుదుచ్చేరి ప్రజలు కూడా ఏకం కావాలనే పిలుపునిచ్చారు సీఎం రేవంత్. కేరళలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగం దేశవ్యాప్తంగా సంచలనాత్మక చర్చను లేవనెత్తింది. దక్షిణాది ఐక్యత ఎంత ముఖ్యమో వివరిస్తూ, రేవంత్ చేసిన వ్యాఖ్యలు, ఈ రాష్ట్రాలు కలిసికట్టుగా ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తున్నాయి. దక్షిణాది ఏకం అయినప్పుడే హక్కులను మరింత సాధించగలవని గుర్తించే విధంగా నేతల్లో బలమైన ముద్ర వేస్తున్నాయి. ఎందుకంటే, ఆర్థిక నిధుల పంపిణీ విషయంలోనూ మోడీ ప్రభుత్వం దక్షిణాదికి విపరీతంగా అన్యాయం చేస్తోంది జనవరి నెలలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వాటాలను పంపిణీ చేసింది. దీని ప్రకారం... దక్షిణాది రాష్ట్రాలను కేంద్రం దారుణంగా మోసం చేసింది. పబ్లిక్ ఇన్ఫర్మేషన్ బ్యూరో అందించిన వివరాల ప్రకారం.. ఉత్తరాదిలో బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తర్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, బీహార్‌ల మొత్తం కంటే ఐదు తెలుగు రాష్ట్రాలకు ఇచ్చిన మొత్తం సగం కంటే తక్కువగా ఉంది.ఉత్తరాదిలో ఉన్న ఈ మూడు రాష్ట్రాలకు కేటాయించింది రూ.62 వేల 24 కోట్లు కాగా.. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటకలకు కలిపి రూ.27 వేల 336 కోట్లు మాత్రమే కేటాయించింది. అంటే, ఒక్క ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రానికి ఇచ్చిన దాని కంటే.. దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాలకు ఇచ్చింది తక్కువగానే ఉంది. ఇక, కేంద్రానికి ఈ రాష్ట్రాల నుండి వంద రూపాయలు వెళ్తుంటే.. కేంద్రం తిరిగి ఈ రాష్ట్రాలకు ఎంత ఇస్తుందో చూస్తే మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే.ఆంధ్రప్రదేశ్ సంగతే చూసుకుంటే.. ఏపీ నుండి కేంద్రానికి రూ.100 వెళ్తుంటే.. వెనక్కి వస్తుంది కేవలం రూ.46 రూపాయలు మాత్రమే. ఇక, తెలంగాణ వంద రూపాయలిస్తే.. కేంద్రం రూ.49 వెనక్కిస్తోంది. ఇక, కర్నాటకకి రూ.13, తమిళనాడుకి రూ.29, కేరళకు రూ.63 రూపాయలు అందుతున్నాయి. అదే, బిజెపి పాలిత ఉత్తరాది రాష్ట్రాలను చూద్దాం. మధ్యప్రదేశ్ నుండి కేంద్రానికి రూ.100 వెళ్తుంటే... తిరిగి కేంద్రం మధ్యప్రదేశ్‌కి రూ.279 రూపాయలు వెనక్కి ఇస్తుంది.ఉత్తర్‌ప్రదేశ్‌కి అయితే వంద రూపాయలకి రూ.333 రూపాయలు వెనక్కిస్తుంది. ఇక, మోడీ ప్రభుత్వాన్ని నిలబెట్టిన జేడీయు పాలించే బీహార్‌కి అయితే ఏకంగా రూ.100 రూపాయలకి.. రూ.9 వందల ఇరవై రెండున్నర రూపాయలు వెనక్కి ఇస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఇలా ఎలా జరుగుతుందని ప్రశ్నించే వారు లేకపోవడం వల్లనే మోడీ ప్రభుత్వం ఇలా మోసం చేస్తుందని దక్షిణాది మేథావులు కూడా విమర్శిస్తున్నారు. దక్షిణాదిని అణగదొక్కడం కోసమే జనాభా ప్రాతిపదికన కేటాయింపులు చేస్తున్నామంటూ కల్లబొల్లి మాటలు చెబుతోంది కేంద్రం.మోడీ మూడో టర్మ్‌లోనే జమిలి ఎన్నికలను కంప్లీట్ చేయడానికి ఇప్పటికే రంగం సిద్ధమయ్యింది. ఇప్పటికే, దీనికి కేంద్ర కేబినేట్ ఆమోదం కూడా లభించింది. ఇది అమలైతే... అనుమానిస్తున్నట్లే దక్షిణాది రాష్ట్రాలు కష్టాలపాలవ్వడం ఖాయంగా కనిపిస్తుంది. ఇప్పుడు దీన్ని అడ్డుకోవడం కోసం విపక్ష పార్టీలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో.. దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయం పైన కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సౌత్ స్టేట్స్‌ను ఒక తాటిపైకి తీసుకురాడానికి ఆయా రాష్ట్రాల ఎంపీలతో ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.ఈ టీమ్‌తో కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చే కార్యచరణను సిద్ధం చేస్తుంది. ప్రస్తుతం, దక్షిణాదిలోని కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా.. కేరళ, తమిళనాడులో అధికార పార్టీలు కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్నారు. ఇక, ఒక్క ఆంధ్రప్రదేశ్ మాత్రమే ఎన్డీయే కూటమి ప్రభుత్వాన్ని నడుపుతోంది. ఈ నేపథ్యంలో.. సాధ్యమైనంత వరకూ ఒక్కో రాష్ట్రం నుండి ఒకరు లేదా ఇద్దరు ఎంపీలను ఎంపిక చేసి, వారిని ఈ ప్రత్యేక కమిటీలో చేర్చుకునే విధంగా ప్లాన్ చేస్తున్నారు. ఇక, దక్షిణాది అంతా ఐక్యంగా కేంద్రంపై పోరాడితే తప్ప ఈ ఐదు రాష్ట్రాలు సుభిక్షంగా మనగలుగుతాయి. లేదంటే, కష్టాలు, కడగండ్లు తప్పని పరిస్థితి వస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని ప్రజలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నది



■ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు

అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకుల గల్లాలు పట్టుకుని ప్రజలు కొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా లేకపోయేసరికి ఎంతో నష్టపోయామన్న భావనలో తెలంగాణ ప్రజలు ఉన్నారన్నారు. ఇవాళ హైదరాబాద్ లోని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ ఇంట్లో ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. మొన్నటి ఖమ్మం వరదల సమయంలో అక్కడి ప్రజలకు మాజీ మంత్రి పువ్వాడ అజయ్ గుర్తుకొచ్చారని చెప్పారు. బర్త్ డే ఫంక్షన్లకు పోవడానికి హెలికాప్టర్ లను ఉపయోగిస్తున్న మంత్రులు, ఖమ్మం వరదలప్పుడు మాత్రం హెలికాప్టర్ లు పంపలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, చేతకానితనానికి ఓ కుటుంబం వరదల్లో కొట్టుకుపోయిందని కేటీఆర్ ఆరోపించారు. ప్రజలు తిడుతున్న తిట్లను వింటే పౌరుషమున్న ఎవడైనా బకెట్ నీళ్లలో దూకి చచ్చేవాడు. కానీ కానీ



రేవంత్ రెడ్డికి రేశం లేదు కాబట్టి అన్ని దులుపుకొని తిరుగుతున్నాడు. మా స్కూటీ ఏమైందని కాలేజీ పిల్లలు కూడా పోస్ట్ కార్డు ఉద్యమం మొదలుపెట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో మోసపోయామని అనుకోని వర్గం ఏది ఈ రాష్ట్రంలో లేదు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా లేకపోయేసరికి ఎంతో నష్టపోయామన్న భావనలో తెలంగాణలోని ప్రతి ఒక్కరూ ఉన్నారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం లోని పనులతో పాటు తెలంగాణలోని ప్రతి పని కాంట్రాక్టు కూడా ఇవ్వాళ ఖమ్మం జిల్లాకు చెందిన మంత్రికే దక్కుతుంది. కాంట్రాక్టు మంత్రి, ఆయన కమిషన్ల కోసమే ముఖ్యమంత్రి పని చేస్తున్నారని నిన్న కొడంగల్ లో చెప్పా. డిప్యూటీ సీఎం 30% కమిషన్లు తీసుకొని పనులు చేస్తున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యేనే చెప్తున్నారు.

ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## స్టాక్ మార్కెట్ క్రాష్

నిరంతర క్షీణతను చూస్తోంది. ఈ కాలంలో సెన్సెక్స్ 3.25 శాతం క్షీణతను చూసింది. మనం డేటాను పరిశీలిస్తే, ఫిబ్రవరి 4న సెన్సెక్స్ ముగిసిన తర్వాత, అది 78,583.81 పాయింట్ల వద్ద కనిపించింది. అప్పటి నుండి, ఇది 2,553.22 పాయింట్ల క్షీణతను చూసింది.

**నిఫ్టీ కూడా క్రాష్..!**

మరోవైపు, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ప్రధాన సూచిక నిఫ్టీ కూడా నష్టాల్లో కూరుకుపోతోంది. ట్రేడింగ్ సెషన్‌లో నిఫ్టీ 394.95 పాయింట్లు తగ్గి 22,986.65 పాయింట్లకు చేరుకుంది. కాగా, ఒక రోజు ముందు నిఫ్టీ 23,381.60 పాయింట్ల వద్ద ముగిసింది. మధ్యాహ్నం 2:15 గంటలకు నిఫ్టీ 362 పాయింట్ల లాభంతో 23,019.80 పాయింట్ల వద్ద ట్రేడవుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం, రాబోయే రోజుల్లో నిఫ్టీ మరింత క్షీణించవచ్చు.నిఫ్టీలో ఈ క్షీణత 5 రోజులుగా కొనసాగుతోంది. ఫిబ్రవరి 4 నుండి, నిఫ్టీ నిరంతరం నేల చూపులు చూస్తోంది. ఈ కాలంలో నిఫ్టీ 3.17 శాతం పడిపోయింది. నిఫ్టీ డేటాను పరిశీలిస్తే, ఫిబ్రవరి 4న అది 23,739.25 పాయింట్ల వద్ద ముగిసింది. దీని అర్థం నిఫ్టీ 752.6 పాయింట్లు క్షీణించింది. ఇది మరింత కొనసాగే అవకాశం ఉంది.

**పెట్టుబడిదారులకు భారీ నష్టం..!**

స్టాక్ మార్కెట్ పతనం కారణంగా, స్టాక్ మార్కెట్ పెట్టుబడిదారులు భారీ నష్టాలను చవిచూశారు. పెట్టుబడిదారుల నష్టం BSE మార్కెట్ క్యాప్ పెరుగుదల లేదా తగ్గుదలపై ఆధారపడి ఉంటుంది. ఒక రోజు ముందు, BSE మార్కెట్ క్యాప్ రూ. 4,17,82,573.79 కోట్లుగా ఉంది. ట్రేడింగ్ సెషన్‌లో ఇది రూ.407 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. అంటే ప్రస్తుత ట్రేడింగ్ సెషన్‌లో పెట్టుబడిదారులు రూ.10 లక్షల కోట్లకు పైగా నష్టపోయారు. ఫిబ్రవరి 4 తర్వాత కాలం గురించి మాట్లాడుకుంటే, పెట్టుబడిదారులు 5 ట్రేడింగ్ సెషన్లలో ఇంకా పెద్ద నష్టాలను చవిచూశారు. బిఎస్ఇ మార్కెట్ క్యాప్ రూ.4,25,50,826.11 కోట్లుగా ఉంది. ఇందులో ఇప్పటివరకు రూ.17.76 లక్షల కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.

## ఇదే తొలిసారి

సాధారణంగా ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పుడు ఏదో ఒక సవాలు ఉంటుంది. కానీ, అధికార మార్పిడి అనంతరం నా జీవితంలో ఇన్ని సవాళ్లు ఎదుర్కోవడం ఇదే తొలిసారి. ఏపీలో వైసీపీ పాలనలో నిర్వీర్యమైన వ్యవస్థలను గాడిలో పెట్టేందుకు కూటమికి ప్రజలు భారీ మెజార్టీతో అధికారమిచ్చారు.గవర్నమెంట్ ఈఆఫీసులో ఫైళ్లు క్లియరెన్సులో వేగం పెరగాలి. ఫైళ్లు ఎక్కడ క్లియర్ కాకుండా ఆగిపోతున్నాయో దానిపైన కార్యదర్శులు, శాఖల విభాగాధిపతులు సమీక్ష చేసుకోవాలి. ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని వాటిని తొలగించి ఫైళ్లు వెంటనే పరిష్కారం చేయాలని సూచించారు. ఫైళ్లలో ఆర్థిక, ఆర్థికేతర అనే రెండు రకాల ఫైళ్లుంటాయి. ఆర్థికేతర ఫైళ్ల పరిష్కారంలో ఫైళ్లు ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్‌లో ఉండకూడదు. ఆర్థిక పరమైన ఫైళ్లు అయితే ఆయా శాఖల్లోని బడ్జెట్ తదితర అంశాలను పరిశీలించి ఆ ఫైళ్లను సాధ్యమైనంత త్వరగా సమీక్షించాలి. కొన్ని శాఖల్లో కొంతమంది అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కొందరు ఆరు నెలలు, సంవత్సరం వరకు తమ వద్ద ఫైళ్లను ఉంచుకుంటున్నారని ఇది సరైన పద్ధతి కాదని చంద్రబాబు సూచించారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సగటున 3 రోజుల్లోనే ఫైళ్లు క్లియరెన్సు అవుతున్నాయని ఆర్టీజీఎస్ సీఈఓ సీఎం చంద్రబాబుకు తెలిపారు. మరికొన్ని శాఖల్లో ఫైళ్లు ఆలస్య అవుతున్నాయని, ఇకనుంచి త్వరగా ఫైళ్లు క్లియర్ చేయాలని మంత్రులు, అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**1. ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (PMG)**

మౌలిక సదుపాయాలు, నిర్మాణ ప్రాజెక్టుల పరిష్కారం, వాటి ప్రస్తుత స్థితిని నిర్ధారించడంలో ప్రాజెక్ట్ మానిటరింగ్ గ్రూప్ (PMG) కీలక పాత్ర పోషిస్తుంది. దీని ద్వారా ప్రాజెక్ట్ అమలును క్రమబద్ధీకరించడానికి వీలు కలుగుతుంది. PMG ప్లాట్‌ఫామ్ ద్వారా ఇన్వెస్టర్లు ఎంట్రీ ఇచ్చి, తరువాత రెగ్యులర్ ట్రాకింగ్, సమస్య పరిష్కారం, ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం వంటి కీలక అంశాలపై ఇది పనిచేస్తుంది.

**2. WhatsApp గవర్నెన్స్ - మన మిత్ర ఇనిషియేటివ్**

జనవరి 30న ఏపీ ప్రభుత్వం అధికారికంగా 161 ప్రభుత్వ సేవల ప్రారంభ సెట్‌తో వాట్సప్ గవర్నెన్స్ మన మిత్ర ప్లాట్‌ఫామ్ ప్రారంభించింది. దీని ద్వారా అదనపు సేవలను అందించడానికి ప్లాట్‌ఫామ్‌ను విస్తరించాలని చర్చించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (TTD) సేవలను కూడా చేర్చాలని భక్తులు కోరుతున్నందున, దేవాదాయ నుంచి మరిన్ని సేవలను ఇందులో అందుబాటులోకి తేవాలని ఐటీ మంత్రి నారా లోకేష్‌నొక్కి చెప్పారు. సర్టిఫికెట్లు, ప్రభుత్వ పత్రాలను గవర్నమెంట్ ఆఫీసులకు వెళ్లకుండా వాట్సాప్ లో అందిస్తున్నారు. APSRTC బస్ ట్రాకింగ్ ఫీచర్ ను అనుసంధానం చేయనున్నారు. సినిమా టికెట్లతో పాటు ఇతర సర్వీసులపై ప్రభుత్వం ఫోకస్ చేస్తోంది. సమర్థవంతమైన డిజిటల్ గవర్నెన్స్ లో భాగంగా వాట్సాప్ గవర్నెన్స్ తెచ్చి ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందుబాటులోకి తేవడంపై మంత్రులతో చంద్రబాబు చర్చించారు

## రేవంత్ కు సోదరుడిలా ఉంటా..

గుర్తు చేశారు. దీనివల్ల ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు లేకుండా చేశామని.. వర్గీకరణకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సీఎం సూచించారు. సీఎం సూచన మేరకు మంద కృష్ణ మాదిగ... ఎస్సీ వర్గీకరణపై కేబినెట్ సబ్ కమిటీకి నేతృత్వం వహిస్తున్న ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణలో ఉపకులాల వారీగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు.ఎస్సీ వర్గీకరణను రాష్ట్రాలు చేసుకోవచ్చని సుప్రీంకోర్టు ప్రకటించిన తర్వాత దేశంలోనే మొట్టమొదటి సారిగా రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వర్గీకరణ చేస్తానని ప్రకటించారు. అయితే ఈ వర్గీకరణ కోసం జీవితాంతం పోరాడిన మంద కృష్ణ రేవంత్ రెడ్డి ప్రకటనను హర్షించలేదు. తమకు నమ్మకం లేదన్నారు. ఈ మధ్య కాలంలో ఉద్యమం కూడా ప్రకటించారు. దాంతో ఇక నుచి వచ్చే ఉద్యోగ ప్రకటనలన్నీ వర్గీరణ తరవాతనే ఉంటాయన్నారు. అసెంబ్లీలో వర్గీకరణ తీర్మానం ప్రవేశ పెట్టిన రోజు కూడా మందకృష్ణ మాదిగ చావు డప్పు కార్యక్రమాన్ని ప్రకటించారు. కానీ అనుమతి లభించకపోవడంతో వాయిదా వేశారు. ఈ లోపు అసెంబ్లీలో వర్గీకరణ బిల్లు పాస్ కావడంతో ఆయన సైలెంట్ అయ్యారు. ఇప్పుడు నేరుగా వచ్చి రేవంత్ రెడ్డిని పొగడటంతో ఓ మిషన్ పూర్తయినట్లు అయింది. ఇంతకు ముందు మందకృష్ణ పూర్తి స్థాయిలో బీజేపీకి మద్దతుగా ఉండేవారు. ఆ పార్టీకే ఓటు వేయమని చెప్పేవారు. అయితే ఇప్పుడు ఆ పార్టీకి ఓటు వేయమని చెప్పకపోయినా.. కాంగ్రెస్ పట్ల మాత్రం వ్యతిరేకత లేనట్లే అనుకోవచ్చు.

## రైతులకు గుడ్ న్యూస్

■ రైతు భరోసా నిధులు విడుదల

జయభేరి, హైదరాబాద్ :



రైతులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది పంట పెట్టుబడి సాయం కింద అందించే రైతు భరోసా స్కీమ్ నిధులను విడుదల చేసింది. విడతల వారీగా రైతు భరోసా నిధులు విడుదల చేస్తోన్న ప్రభుత్వం.. తాజాగా రెండు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులకు 2025, ఫిబ్రవరి 10న 2 వేల 223 కోట్ల నిధులు రిలీజ్ చేసింది. తొలి విడతలో ఎకరం లోపు భూమి ఉన్న రైతులకు నిధులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. రెండు దశల్లో కలిపి ఇప్పటి వరకు మొత్తం 34 లక్షల 75వేల 994 మంది రైతుల ఖాతాలో రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. రైతు భరోసా నిధులు విడుదల కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతు భరోసా కింద రాష్ట్రంలోని ప్రతి రైతుకు ఎకరాకు 15 వేల పంట పెట్టుబడి సాయం అందిస్తామని కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా. 15 వేలు కాకుండా 12 వేల ఆర్థిక సహాయం చేస్తోంది. ఈ క్రమంలోనే వచ్చే సీజన్‌కు సంబంధించిన నిధులను ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది.



# కుంభమేళా యాత్రలో విషాదం

- తిరుగు ప్రయాణంలో ప్రమాదం.. ఏడుగురు మృతి
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ తో ఫోన్ లో మాట్లాడిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

మేడ్చల్ జిల్లా నాచారం నుంచి కుంభమేళాకు వెళ్లిన భక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కుంభమేళ ప్రయాగరాజు నుండి తిరుగు ప్రయాణంలో ఘటన జరిగింది. మధ్యప్రదేశ్ జబల్పూర్ శిరోహి ప్రాంతంలో మంగళవారం ఉదయం 9 గంటల పది పది నిమిషాలకు సంఘటన జరిగింది. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారని వార్త. ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. వారికి స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరంతా నాచారం రాఘవేంద్ర నగర్, కార్తికేయ నగర్ కు చెందిన వారు. రాఘవేంద్ర నగర్ చెందిన శశికాంత్ కుటుంబసభ్యులను మేడ్చల జిల్లా కలెక్టర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఫోన్ లో పరామర్శించారు. మృతదేహాలను మధ్యప్రదేశ్ నుండి త్వరగా తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. మహాకుంభమేళా నుంచి తిరిగొస్తుండగా ఘోర రోడ్డు ప్రమాదం నాచారంకి చెందిన ఏడుగురు మృతి చెందడం పట్ల ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. వీరి మృతి పట్ల తీవ్రదిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. పోస్టుమార్టం త్వరగా పూర్తి చేయాలని కోరారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ఎప్పటికప్పుడు సమాచారం అందజేయాలని స్థానిక కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ ని కోరారు. మృతులు ఆనంద్ కన్సారి, శశి కాన్సారి, రవి విశ్వనాథన్, టీవీ ప్రసాద్, మల్లారెడ్డి, బాల కృష్ణ శ్రీ రామ్, రాజు.

# బాయ్స్ ప్రైవేట్ పార్ట్స్ టచ్ చేస్తు విద్యార్థులను వేధిస్తున్న ప్రిన్సిపల్

**జయభేరి, మేడిపల్లి :**

మేడ్చల్ జిల్లా మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి బోడుప్పల్ శ్రీ బ్రీలియంట్ టెక్నో హైస్కూల్ లో ప్రిన్సిపల్ రవీందర్ రావు తొమ్మిది, పదవ తరగతి విద్యార్థుల ప్రైవేట్ పార్ట్స్ టచ్ చేస్తున్నాడని విద్యార్థుల ఆరోపణ. దాంతో స్కూల్ ముందు విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగారు. ప్రిన్సిపల్ రవీంద్రరావు మాట్లాడుతూ పిల్లలను సక్రమమైన మార్గంలో ఉంచాలని పిల్లల తల్లిదండ్రులు కోరినట్లు చెప్పారు దానితో విద్యార్థులను పిలిచి మందలించే క్రమంలో టై, ప్యాంటు పట్టుకున్నానని అంతేగాని ఎలాంటి వేరే ఆలోచన నాకు లేదని అన్నాడు.

# రంగరాజన్ ను పరామర్శించిన గజ్వేల్ బ్రాహ్మణ సంఘం



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 11 :**

చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకులు రంగరాజన్ పై జరిగిన దాడిని తెలుసుకుని మంగళవారం ఆయన ను గజ్వేల్ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పరామర్శించారు దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దేశపతి శంకరశర్మ కార్యదర్శి రవీందర్ రావు, కోశాధికారి విటాల కృష్ణమూర్తి శర్మ, చాడ నంద బాల శర్మ, యువ వాహిని అధ్యక్షులు సాయి కృష్ణ శర్మ, కార్యదర్శి నందగిరి శ్యాం ప్రసాద్ శర్మ, కోశాధికారి రఘు మురళీమోహన్, శర్మవిశ్వేశ్వరరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా పని చేద్దాం

- ఆలూరు సాంబ శివారెడ్డి ని కలసిన సాకే శైలజనాథ్



**జయభేరి, అనంతపురం :**


అనంతపురం వైఎస్సార్సీపీ నేత ఆలూరు సాంబశివారెడ్డి స్వగృహం నందు మాజీ మంత్రి వైఎస్సార్సీపీ నేత సాకే శైలజనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శైలజనాథ్ గత కొద్దిరోజుల క్రితం వైసీపీలోకి చేరిన సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వైసిపి పార్టీ పెట్టినప్పటి నుంచి నియోజకవర్గానికి ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రాతినిధ్యం వహిస్తున్న సంగతి తెలిసిందే. నియోజకవర్గంలోని రాజకీయాలపై చర్చించారు. కలిసికట్టుగా పని చేద్దామని, పార్టీ అభివృద్ధికి కృషి చేద్దామని ఆయన సాంబశివారెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి

**జయభేరి, దేవరకొండ :**





రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ బరిలో నిలిచేందుకు సిద్ధంకావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేవరకొండ పట్టణంలోని స్థానిక పల్లా పర్వత్ రెడ్డి భవన్ లో సిపిఐ నియోజకవర్గ అన్ని మండలాల కార్యవర్గ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు.

ఈ సమావేశంలో పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థలైన ఎంపిటిసి, జడ్పిటిసి, మున్సిపల్, సర్పంచ్ ఎన్నికల్లో అధిక స్థానలలో పోటీచేసి ప్రజాసమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఎర్రజెండా గ్రామ గ్రామానికి విస్తరించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడేది సిపిఐ పార్టీ మాత్రమేనని, ఆ పార్టీ అవసరాన్ని ప్రజలు గుర్తించి కమ్యూనిస్టు పార్టీలో చేరాలని కోరారు. పార్టీ శ్రేణులు అన్ని గ్రామాలు తిరిగి కొత్త శాఖలు ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ సర్వే బిసి కులగణనతోపాటు 30ఏండ్ల సుదీర్ఘపోరాటమైన ఎసిసి వర్గీకరణను ఆమోదిస్తూ తెలంగాణ అసెంబ్లీలో చేసిన ఆమోదాన్ని స్వాగతిస్తున్నామని, అట్టి ఆమోదాన్ని కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంట్లో చట్టం చేసి ఈవర్గాలకు న్యాయం చేయాలన్నారు. అదేవిధంగా కేంద్రప్రభుత్వం పార్లమెంట్లో ప్రవేశపెట్టిన బడ్జెట్ తెలంగాణ రాష్ట్రానికి తీరు అన్యాయం చేసిందని విమర్శించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఏ ఒక్క అంశాన్ని కూడా నిధులు కేటాయించకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేసిన సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

ప్రభుత్వం ఇస్తున్న రైతు బంధు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు సంక్షేమ పథకాలు ఇచ్చే పక్రియ వెంటనే చేపట్టి అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు, మండల కార్యదర్శులు తూం బుచ్చిరెడ్డి, ఎండీ మైనోద్దీన్, పోలె వెంకటయ్య, కుంభం జయరాములు, బొమ్ము అచ్చయ్య, యాసాని పాండురంగ రెడ్డి, నూనె రామస్వామి, వలమల్ల ఆంజనేయులు, అన్ని మండలాల కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే బ్రిడ్జ్ పనులను పరిశీలించిన విక్రమ్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్:**



మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ దక్షయిని సామెత రామలింగేశ్వర స్వామి జాతర మరియు శివ రాత్రి పురస్కరించుకొని ఆలయానికి వేలాదిగా తరలి వెల్లె భక్తుల సౌకర్యార్థం రైల్వే బ్రిడ్జి వద్ద పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని, రోడ్డును ప్రారంభించాలని తెలంగాణ బిజెపి రాష్ట్ర నాయకులు పట్లొల్ల విక్రమ్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు జల్లి శైలజ హరినాథ్ ఆధ్వర్యంలో రైల్వే బ్రిడ్జినీ సందర్శించి రైల్వే అధికారులు, కాంట్రాక్టర్ తో మాట్లాడి శివరాత్రి పండుగ రోజున శివాలయానికి వాహనాలు, భక్తులు వెల్లె విధంగా సౌకర్యం కల్పించాలని కోరడం జరిగింది. అధికారులు, కాంట్రాక్టర్ సానుకూలంగా స్పందించి దారి కల్పిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో మేడ్చల్ సీనియర్ నాయకులు డీ.వీ.కిషన్ రావు, మేడ్చల్ మాజీ సర్పంచ్ మురళీధర్ గుప్త, పాతూరి సుధాకర్ రెడ్డి, జగన్ గౌడ్, మేడ్చల్ మున్సిపాలిటీ బిజెవైఎం అధ్యక్షులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, లవంగ శ్రీకాంత్, చెర్వుకొమ్ము శ్రీనివాస్ గౌడ్, జకట ప్రేమ్ దాస్, రాగం అర్జున్, మామిల్ల నర్సింగ్ రావు, సదామని నరేందర్, బొజ్జ వంశీ రెడ్డి, మైసరి రాజు వంజరి, ధాత్రిక లక్ష్మణ్ వంజరి, ఈశ్వర్ కురుమ, మహేష్, ప్రణయ్, విశ్వజిత్, ఎన్.ఎస్.గౌడ్, డీ.సాయి, కిస్టాపూర్ అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

# బంజారా హస్త కళలకు ఉత్తమ ప్రతిభ

- మర్రిచెట్టు తండా వాసులకు సర్టిఫికెట్లను అందించిన DRDA PD శేఖర్ రెడ్డి, నాబార్డ్ DDM వినయ్ కుమార్, AGM సత్యనారాయణ
- మినీ సరస్ ఫెయిర్ 2025 నల్గొండ జిల్లాలో నిర్వహించిన ఎగ్జిబిషన్లో మరిచెట్టు తండా బంజారా హ్యాండీక్రాఫ్ట్ స్టాల్ ప్రదర్శన





**జయభేరి, దేవరకొండ :**

జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ నల్గొండ (DRDA) ఆధ్వర్యంలో నిర్వహించిన మినీ సరస్ ఫెయిర్ 2025 మేళా లో దేవరకొండ మండలంలోని మర్రి చెట్టుతండా గ్రామపంచాయతీ సంత్ శ్రీ సేవాలాల్ బంజారా హ్యాండీ క్రాఫ్ట్స్ తరుపున 7 రోజుల పాటు నిర్వహించిన స్టాల్స్ ను ప్రతిభను కనబరిచినందుకు DRDA PD శేఖర్ రెడ్డి, నాబార్డ్ DDM వినయ్ కుమార్, ఏజీఎం సత్యనారాయణ సర్టిఫికెట్ లను అందచేశారు. అనంతరం మాజీ సర్పంచ్ శ్రీను నాయక్ మాట్లాడుతూ.. మా మర్రిచెట్టు తండా గ్రామపంచాయతీలో మహిళలతో చేతి అల్లికలతో తయారుచేసిన బంజారా వస్తువులను డిఆర్డిఏ నాబార్డ్ ఆధ్వర్యంలో నల్గొండ జరిగిన ఎగ్జిబిషన్లో ఏడు రోజులపాటు స్టాల్స్ నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. ఈ స్టాల్స్ లో మా బంజారా వస్తువులను కొనడానికి చాలామంది ఆసక్తి చూపారు, మాకు ఆర్డర్స్ కూడా ఇవ్వడం జరిగింది. మా బంజారా హస్త కళలను గుర్తించి ఉత్తమ ప్రతిభను కనబరిచినందుకు మాకు సర్టిఫికెట్ ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఈ స్టాల్ ఏర్పాటుకు సహకరించిన డిఆర్డిఏ పిడి శేఖర్ రెడ్డి కి, నాబా డిడియం వినయ్ కుమార్ కి, వెలుగు యాదయ్య, సత్యవతి మేడం, ఏ జి ఎం కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసినారు.






# నివాళులు అర్పించిన కాంగ్రేస్ నాయకులు



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 11:**

మంగళవారం పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు పరకాల మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ (సోదరులు) అన్న సోదా రామ్ దత్ దినకర్మ కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు సురేందర్ మొహరోలియా, సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ చైర్మన్ ఆలోక్ కుమార్ జా, వాల్మీకి రాష్ట్ర అధ్యక్షులు రాజేష్, హనుమకొండ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అజీజ్ ఖాన్, పరకాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయపాల్ రెడ్డి, హనుమకొండ బిల్డర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రబెల్లి తిరుపతిరెడ్డి, ఎమ్మార్పిఎస్ జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ, సోదా బాబూలాల్,
సోదా బిషన్ దత్, రేగొండ పిఏసిఎస్ చైర్మన్ నడిపెల్లి విజ్జన్ రావు, రేగొండ మాజీ జెడ్పిటిసి పత్తి ప్రభాకర్, పిట్ట దేవేందర్. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొయ్యాడ శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్స్, పార్టీ నాయకులు, మీడియా మిత్రులు, పాత్రికేయులు, శ్రేయోభిలాషులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ విద్యాధరి క్షేత్రంలో.. వైభవంగా వార్షికోత్సవ వేడుకలు

**జయభేరి, వర్గల్, ఫిబ్రవరి 11 :**

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో సోమవారం వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, అలంకరణ, చండీ హోమం తదితర కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని శ్రీ విద్యాధరి క్షేత్రంతో పాటు శ్రీ శనైశ్చర, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర, శ్రీ సుబ్రహ్మణ్య, శ్రీ శంభు లింగేశ్వర ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ ఆలయాలకు పుట్టినిల్లుగా వర్గల్ శంభూగిరి కొండలు విశేష ప్రాచుర్యం పొందినట్లు పేర్కొన్నారు. నిత్యం అమ్మవారి నామస్మరణతో మార్మోగుతుండగా, ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరుస్తున్నట్లు స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరిలో భగవన్నామస్మరణ, ఆధ్యాత్మిక చింతన అలవర్చడం తమ లక్ష్యమని అన్నారు. గత 34 ఏళ్లుగా శ్రీ విద్యాధరి అమ్మవారు భక్తుల పాలిట కొంగుబంగారంగా, చదువుల తల్లిగా, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా ప్రసిద్ధి చెందగా, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు విశేష సేవనందిస్తూ తరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు పొద్దుటూరి నరసింహారావు, దాచేపల్లి వెంకట కృష్ణారావు, బొమ్మిడాల సత్యనారాయణ, గంగా శ్రీనివాస్ గుప్త, ఇర్రి మల్లారెడ్డి, గంగిశెట్టి సుధాకర్ గుప్త, నూక బిక్షపతి గుప్త, రేణిగుంట శ్రీనివాస్ గుప్త, రంగయ్య గుప్త, దోసపాటి లక్ష్మణరావు గుప్త తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ నుంచి కోళ్ల రవాణా బంద్



**జయభేరి, కోదాడ:**

బర్డ్ ఫ్లూ వ్యాధి పౌల్ట్రీ ఫార్మ్ వ్యాపారాన్ని చిన్నభిన్నం చేస్తుంది. పౌల్ట్రీ కోళ్లను తింటున్న మనుషులకు సైతం ఆ ఎఫెక్ట్ కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల పాటు పౌల్ట్రీ కోళ్లను తినకపోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సరిహద్దుల్లో నుంచి తెలంగాణ రాష్ట్రంలోకి కోళ్ల రవాణాను వెటర్నరీ డాక్టర్లు అడ్డుకుంటున్నారు. లారీలు ఇతర వాహనాల ద్వారా సరఫరా చేసే పౌల్ట్రీ కోళ్లను తిరిగి వెనక్కి పంపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై ఉన్న కోదాడ బార్డర్ చెక్పోస్ట్ దగ్గర..ఏపీ నుంచి తెలంగాణలోకి పౌల్ట్రీ కోళ్లతో వస్తున్న వాహనాలను వెటర్నరీ అధికారులు అడ్డుకున్నారు.

ప్రభాత జయభేరి

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

- హరీష్ రావు

జయభేరి, సిద్దిపేట :



సిద్ధిపేట కొనాయిపల్లి గ్రామంలో భక్తిశ్రద్ధలతో శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరీశ్ రావు మాట్లాడుతూ కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. కెసిఆర్ కి ఇష్టమైన ఆలయం కోనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం. తెలంగాణ ఉద్యమాన్ని ఈ ఆలయం నుంచే ప్రారంభించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. కెసిఆర్ ఏ ముఖ్య కార్యక్రమాన్ని అయినా ఈ దేవాలయం నుండి ప్రారంభిస్తారు. కేసీఆర్ మూడు కోట్ల 60 లక్షలతో దేవాలయాన్ని అభివృద్ధి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. తెలంగాణ రాష్ట్రానికి పూర్వ వైభవం వచ్చే విధంగా చూడాలని వెంకటేశ్వర స్వామిని కోరడం జరిగింది. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను కేసీఆర్ అభివృద్ధిపరిచారు. సిద్దిపేట జిల్లాలో 75 కోట్లతో అనేక దేవాలయాలను అభివృద్ధి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి 15 నెలలుగా దేవాలయాలకు నిధులు విడుదల చేయడం లేదు. కొత్తగా ఒక్క దేవాలయాన్ని కూడా అభివృద్ధి చేయలేదు. గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను కూడా నిలిపివేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాలను నిర్లక్ష్యం చేస్తున్నది. దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టు కల్లా రైతు రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి మాట ఇచ్చి మోసం చేశారు. మాట తప్పడం తప్ప మాట నిలబెట్టుకోవడం రేవంత్ రెడ్డికి చేతకాదు. చబ్బీస్ జనవరి కి రైతు భరోసా అందరు రైతులకు ఇస్తామన్నారు ఇప్పటివరకు పూర్తి చేయలేదు. చబ్బీస్ జనవరి కి ఇందిరమ్మ భరోసా ఇస్తామన్నారు ఇప్పటివరకు వేయలేదు. పది పైసల మంది కూడా అందలేదు. కెసిఆర్ సంక్షేమ పథకాల కోతలు పెట్టారు.
వానకాలం రైతు బంధు ఎగబెట్టి ఎనిమిది వేల కోట్ల రూపాయలు రైతుల కందకుండా చేశారు. కెసిఆర్ కిట్టు మహిళలకు అందించకుండా వేల కోట్లు ఎగబెట్టారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోకుండా మోసం చేస్తున్నది కాంగ్రెస్ పార్టీ. మహారాష్ట్ర, హర్యానా, ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీని చిత్తుచిత్తుగా ఒడగొట్టారు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో ఓడగొట్టారు. ఈరోజు ఫిబ్రవరి 11 ప్రామిసస్ డే. ఈ ప్రామిస్ డే సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నాం. ప్రామిస్ డే సందర్భంగామీరు ఇచ్చిన ప్రామిస్ నిలబెట్టుకోవాలని రేవంత్ రెడ్డికి కోరుతున్నాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. బీసీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాకే ఎన్నికలకు వెళ్ళాలని అన్నారు.



# మినీ మేడారం జాతరకు అంతా సిద్ధం

జయభేరి, ములుగు:

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఫిబ్రవరి 12 నుండి 15 వరకు నిర్వహించే మినీ మేడారం జాతర సర్వం సిద్ధమైంది. మేడారం సమ్మక్క సారలమ్మ వనదేవతల మినీ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తుల సౌకర్యార్థం మినీ మేడారం జాతర విజయవంతం చేయడానికి ముందు నుంచే ప్రత్యేక ప్రణాళికతో అన్ని శాఖల అధికారులు, పూజారులు సమన్వయంతో ముమ్మరంగా పనులు చేపట్టి, భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. గురువారం తాడ్వాయి మండలం లోని మేడారం లో పలు శాఖల అధికారులతో కలిసి వైద్య శిబిరం, జంపన్న వాగు వద్ద స్నాన ఘట్టాలను, మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఏర్పాటు చేసిన గదులను పరిశీలించిన అనంతరం గద్దెల ప్రాంతంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతరకు 10 నుండి 20 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉండడంతో దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని, నాలుగు రోజులపాటు జరిగే జాతర సందర్భంగా నిరంతరం విద్యుత్ సరఫరా చేయడమే కాకుండా వైద్య సిబ్బంది 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్య శాఖ సిబ్బంది అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, అత్యవసర సమయాలలో ఇబ్బందులకు గురయ్యే వారిని జిల్లా కేంద్రానికి తరలించడానికి వాహనాలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. గద్దెల ప్రాంతంలో క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా చోరీ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. జంపన్న వాగు, గద్దెల ప్రాంతం, మేడారం పరిసర ప్రాంతాలలో పారిశుద్ధ్య కార్మికులచే నిరంతరం శుభ్రం చేయించాలని డిపిఓను ఆదేశించారు. భారీ సంఖ్యలో వాహనాలు వచ్చిన పక్షంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలలో వాహనాలు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని, నిరంతరం పోలీస్ శాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రస్తుతం ఎండలు మండిపోతున్న సందర్భంగా గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిర్లను ఏర్పాటు చేయడమే కాకుండా మ్యాట్లను ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు. దాదాపు 5 కోట్ల 30 లక్షల రూపాయలతో వివిధ పనులను పూర్తి చేయడం జరిగిందన్నారు. జాతరను పురస్కరించుకొని పలుచోట్ల ప్రత్యేకంగా మరుగుదొడ్లను ఏర్పాటు చేశామని, త్రాగునీటి కొరత ఏర్పడకుండా నిరంతరం నీటిని సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ అధికారులు హనుమకొండ జిల్లా కేంద్రం నుండి నిరంతరం బస్సులను మేడారం నడిపించనున్నారని, జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వర్తిస్తుందని తెలిపారు. వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చే సందర్శకులు తమ మొక్కులను చెల్లించుకొని తిరుగు ప్రయాణం కావాలని ఆయన సూచిం.

# విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

- జిల్లా వైద్యాధికారి వెంకటరమణ

జయభేరి, సైదాపూర్ :



సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది విధుల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సైదాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంపై ఫిర్యాదులు వస్తున్నాయని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని హెచ్చరించారు. నార్మల్ డెలివరీలను పెంచే విధంగా చర్యలు చేపట్టాలని



సిబ్బందిని సూచించారు. సూపర్వైజర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సబ్ సెంటర్లను తనిఖీలు చేయాలని సూచించారు మాత సంరక్షణ, మలేరియా, వ్యాధి నిరోధక టీకాలు, హెచ్ఐవి, టీబి తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ ను తొలగించి ఆయన స్థానంలో వెన్నంపల్లి సబ్ సెంటర్ వైద్యుడు కృష్ణారావును నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ చందు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాం నాయక్, జిల్లా ఆరోగ్య బోధకులు పంజాల ప్రతాప్, పిహెచ్సి సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# అవసరమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది

- రెప్పపాటు కూడా అంతరాయం ఏర్పడవద్దు
- 1912 నెంబర్ వినియోగదారులందరికీ చేరాలి
- ఉత్తమ సేవలు అందించే సిబ్బందికి పురస్కారాలు
- విద్యుత్ అధికారుల సమీక్ష సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

జయభేరి, హైదరాబాద్:



రానున్న వేసవిలో డిమాండ్ మేరకు విద్యుత్తును అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఎస్పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ అధికారులతో వేసవిలో విద్యుత్ సరఫరా ప్రణాళిక పై సమీక్ష సమావేశం నిర్వహించారు. గత వేసవిలో వచ్చిన విద్యుత్ డిమాండ్, రానున్న వేసవిలో ఏ మేరకు విద్యుత్తు డిమాండ్ ఉంటుంది.. అందుకు తగిన విధంగా అధికారులు చేసుకున్న ప్రణాళికల వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అవసరాల మేరకు అధికారులు కోరిన అన్ని వసతులు కల్పించిన నేపథ్యంలో రానున్న వేసవిలో క్షణం కూడా విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా అనేది సున్నితమైన అంశం, నిత్యవసరం కూడా ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని నిరంతరం అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అన్నారు. వేసవి ప్రణాళికపై అన్ని స్థాయిల్లో అధికారులు వెనువెంటనే సమావేశం నిర్వహించుకుని క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఏ రీతిలో సన్నద్ధంగా ఉన్నారు, వినియోగదారులకు సైతం అవగాహన కల్పించాలి అన్నారు. విద్యుత్ శాఖలో లైన్మెన్ మొదలు విద్యుత్ శాఖ మంత్రి వరకు ఒక కుటుంబంలో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఏ సమస్య వచ్చినా వెంటనే పై అధికారికి ఫోన్ చేయాలని వారు స్పందించని పక్షంలో ఆపై అధికారికి అలా నాకు కూడా ఫోన్ చేయవచ్చని సిబ్బందికి డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. మీకు క్షేత్రస్థాయిలో కావలసిన వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం, ఏదైనా అడగవచ్చని అధికారులకు డిప్యూటీ సీఎం తెలిపారు. హైదరాబాద్ నగరంలో ఎమర్జెన్సీ వాహనాల ద్వారా కొనసాగుతున్న విద్యుత్ సేవలు గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులు కోరిన అన్ని అనుమతులు ఇచ్చాం, మార్చి మొదటి తేదీ నాటికి సబ్ స్టేషన్ల నిర్మాణం ఇతర పనులు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. గత మూడు సంవత్సరాలుగా సబ్ స్టేషన్ లపై పెరుగుతున్న లోడ్ భారం వివరాలను డిప్యూటీ సీఎం సమీక్షించారు. బాగా పని చేసే వారికి ప్రోత్సాహకంగా అవార్డులు సైతం ఇచ్చే కార్యక్రమాన్ని విద్యుత్ శాఖలో ప్రారంభించాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. మొన్నటి భారీ వరదల సమయంలో అర్ధరాత్రి కూడా విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది తీవ్రంగా శ్రమించారని అటువంటివారిని గుర్తించాలని డిప్యూటీ సీఎం అన్నారు. విద్యుత్ రంగంలో వస్తున్న మార్పులపై అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించాలని డిప్యూటీ సీఎం కోరారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, ప్రత్యామ్నాయ విద్యుత్తు ఉత్పత్తి ఈ రంగంలో ప్రపంచంలో వస్తున్న మార్పులపై సిబ్బందికి అవగాహన అవసరమని డిప్యూటీ సీఎం అభిప్రాయపడ్డారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన డయల్ 1912 కు విస్తృతంగా ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఇలాంటి సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రతి వినియోగదారునికి తెలిసేలా వారి మొబైల్ నెంబర్ కు 1912 ఎస్ఎంఎస్ చేయాలని, కరెంటు బిల్లు పైన సైతం 1912 సేవల గురించి ప్రచురించాలని ఆదేశించారు. ఈ విభాగాన్ని పటిష్టం చేసేందుకు సిబ్బంది సంఖ్య పెంచడం, సాంకేతికంగా అదనపు హంగులు కల్పించేందుకు అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. స్టోర్స్ లో అందుబాటులో ఉన్న సామాగ్రి, రాబోయే రోజుల్లో డిమాండ్కు తగిన విధంగా చేసుకుంటున్న ఏర్పాట్లపై వివిధ విభాగాల్లో ఉన్న సీఈలతో ప్రత్యేకంగా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. గత ఏడాదికి వస్తున్న సమస్యల్లో తేడాలు, ఫిర్యాదులు తగ్గడానికి చేపట్టిన చర్యలను అధికారుల ద్వారా డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్కో సిఎండి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఇంధన శాఖ ఓఎస్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## కోర్టు ఆదేశాలతో చైర్మన్ గా నాగయ్య

- పిపిసిఎస్ చైర్మన్ తిరిగి బాధ్యతలు స్వీకరణ
- మర్యాదపూర్వకంగా చల్లా ను కలిసిన కమిటీ సభ్యులు

జయభేరి, పరకాల, ఫిబ్రవరి 22:

పరకాల పిఏఎస్ చైర్మన్ గా తిరిగి బాధ్యతలు చేపట్టిన గుండెబోయిన నాగయ్య, కమిటీ సభ్యులు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ని హన్మకొండలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కోర్టు ఆదేశాలతో తిరిగి చైర్మన్ బాధ్యతలు చేపట్టిన చైర్మన్ నాగయ్యని, కమిటీ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పుష్పగుచ్ఛం అందచేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండ మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మండలంలోని బొడ్డుపల్లి గ్రామానికి చెందిన దువ్వా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పడటిపల్లి గ్రామానికి చెందిన మస్న శివ కుమార్, కోశాధికారిగా శేఖర్ ల ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ తమ మీద పెట్టిన నూతన బాధితులను శక్తి వంచన లేకుండా నిర్వహిస్తామని తమ వంతు సమయం ఆర్థిక సహాయం ను అందిస్తామని పద్మశాలి సమాజం అభ్యత్వానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దేవరకొండ డివిజన్ జిల్లా పెద్దల సలహా సూచనలతో సంఘాన్ని మరింత పటిష్టం చేసి ముందుకు తీసుకెళ్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన స్థానిక పద్మశాలి సంఘం నాయకులకు రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలియజేసినారు.

## మానసికంగా ఇబ్బంది పడుతున్న చిన్నారులకు వైద్య పరీక్షలు



జయభేరి, చింతపల్లి :

చింతపల్లి మండల పరిధిలోని నసర్ల పల్లి వింజమూర్ కి చెందిన ఇద్దరు చిన్నారులు మానసికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు బాదేపల్లి పులి రాజు గౌడ్ వెంటనే స్వయంగా హైదరాబాదులోని సికింద్రాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లి తను స్వయంగా దగ్గరుండి వారికి వైద్య పరీక్షలు చేయించారు. వారికి మందులు ఇప్పించినాడు. ఈ విషయం గ్రామ ప్రజలు పలువురికి తెలియడంతో పులి రాజు గౌడ్ ని గ్రామస్తులు అభినందించారు గతంలో కూడా ఎన్నో సేవా కార్యక్రమాలు తరచుగా చేస్తూ ఉంటారు అని పులి రాజు గౌడ్ ను అభినందించినారు.

## సంఘం కార్యదర్శి చంద్రమౌళిని సన్మానించిన పద్మశాలి సంఘం



జయభేరి, దేవరకొండ :

తెలంగాణ ముద్దుబిడ్డ పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళి , శ్రీ భక్త మార్కండేయ స్వామి దేవాలయంలో పద్మశాలి సంఘం సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరై ఇటీవల పట్టణ పద్మశాలి సంఘం నూతన సహాయ కార్యదర్శిగా నియమితులైన మాకం చంద్రమౌళి (CM) ని హృదయపూర్వకంగా అభినందిస్తూ శాలువతో ఘనంగా సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై ప్రయాణికులను వదిలేసిన శ్రీకృష్ణ ట్రావెల్స్

జయభేరి, రంగారెడ్డి:

శంషాబాద్ మండలం లోని పాల్మాకుల్ వద్ద శ్రీకృష్ణ ప్రైవేట్ ట్రావెల్స్ సిబ్బంది ప్రయాణికులను అర్ధాంతరంగా దింపి వెళ్లిపోయారు. ఆర్టీఏ అధికారుల తనిఖీలతో ప్రయాణికులను నడిరోడ్డు మీద దింపేసారు. బస్సు ఫిట్నెస్, పర్మిట్ లేకపోవడంతో బస్సు చెడిపోయింది అంటూ ప్రయాణికులను తప్పుదోవ పట్టించి పాల్మాకుల్ వద్ద దింపేసారు. శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సులో తిరుపతి నుండి హైదరాబాద్ 43 మంది ప్రయాణికులు వస్తున్నారు. నడిరోడ్డుపై దింపేయడంతో వృద్ధులు, మహిళలు పసిపిల్లల అవస్థలు పడ్డారు. సమయానికి హైదరాబాద్ చేరుకోకపోవడంతో ఉద్యోగుల అవస్థలు పడ్డారు. శంషాబాద్ పరిధిలోని తొండుపల్లి వద్ద హైదరాబాద్ బెంగళూరు జాతీయ రహదారిపై ఆర్టీఏ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్న సమయం లో ఇది జరిగింది.



# వాలెంటైన్స్ డే డ్రెస్సింగ్ స్టైల్

■ ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డే. ప్రేమికులు ఈ రోజును ప్రత్యేకంగా నిర్వహించుకుంటారు. అమ్మాయిలు ప్రేమికుల రోజుకు అందంగా తయారయ్యేందుకు ముందస్తుగా సిద్ధమవుతారు. ఈ రోజు స్టైలిష్‌గా కనిపించడానికి కొన్ని ఫ్యాషన్ హ్యాక్స్ ఇక్కడ ఉన్నాయి.

ఫిబ్రవరి అంటనే ప్రేమ మాసం. ఇక ప్రేమ వారం ఇప్పుడు నడుస్తోంది. రోజ్ డే మొదలైన ప్రేమ వారం ఫిబ్రవరి 14 వాలెంటైన్స్ డేతో ముగుస్తుంది. ప్రేమికులు ఈ రోజు కోసం ఎంతో ఏడాదంతా ఎదురు చూస్తారు. ఫిబ్రవరిలో వచ్చే ఈ ప్రత్యేకమైన రోజుకు ప్రేమ పక్షులు ముందస్తుగానే సిద్ధమవుతారు. వాలెంటైన్స్ డే రోజున జంటలు డేట్‌కు వెళతారు లేదా స్నేహితులతో కలిసి నైట్ అవుట్‌కు వెళతారు. అమ్మాయిలు ఈ రోజు అందంగా కనిపించాలని కోరుకుంటారు. మీరు కూడా ఈ ప్రత్యేకమైన రోజున మీ భాగస్వామితో డేట్‌కు వెళుతున్నట్లయితే, ఇక్కడ ఇచ్చిన ఫ్యాషన్ హ్యాక్స్ మీకు ఉపయోగపడతాయి. ఈ హ్యాక్స్ ద్వారా మీరు డబ్బును కూడా ఆదా చేసుకోవచ్చు. వాలెంటైన్స్ డే కోసం ఫ్యాషన్ హ్యాక్స్ చూడండి.

**అందమైన రెడ్ టాప్**

మీ వద్ద రెడ్ కలర్ టాప్ ఉంటే వాలెంటైన్స్ డే కు వేసుకుంటే సరిపోతుంది. ఈ టాప్‌ను బేజ్ మినీ స్కర్ట్, మోకాలి వరకు ఉన్న కిట్టెన్ బూట్లతో జత చేయండి. దీని తోపాటు అందమైన స్లింగ్ బ్యాగ్‌ను క్యారీ చేయండి. ఈ లుక్‌లో మీ జుట్టును హాఫ్ బన్‌లో కట్టుకోవచ్చు. క్యూట్ లుక్ కోసం ఈ స్టైల్ ఉత్తమం. మీ వద్ద బేజ్ కలర్ స్కర్ట్ లేకపోతే దీన్ని బ్లాక్ లేదా ఆఫ్ వైట్ కలర్ స్కర్ట్‌తో కూడా జత చేయవచ్చు.

**షైనింగ్ డ్రెస్**

మీరు రాత్రి సమయంలో మీ భాగస్వామితో డేట్‌కు వెళుతున్నట్లయితే, షైనింగ్ డ్రెస్ అద్భుతంగా ఉంటుంది. ఈ రకమైన డ్రెస్‌ను బోల్డ్ ఈయర్ రింగ్స్, ఆకర్షణీయమైన సిల్వర్ లేదా గోల్డ్ హీల్స్‌తో జత చేయండి. మేకప్‌ను న్యూడ్‌గా ఉంచి, లిప్‌స్టిక్‌ను డార్క్ లేదా లైట్ డ్రెస్ కలర్‌కు తగినట్లుగా ఎంచుకోండి.

**కార్సెట్ టాప్**

మోకాలి వరకు ఉన్న డెనిమ్ స్కర్ట్‌తో అందమైన కార్సెట్ టాప్‌ను ధరించవచ్చు. దీన్ని మీరు క్రాప్డ్ బాంబర్ జాకెట్, వైట్ స్నీకర్స్‌తో లేదా లాంగ్ కోట్, స్టిలెట్టోస్‌తో జత చేయవచ్చు. స్టైలింగ్ కోసం జుట్టును కర్ల్ చేసి విప్పి ఉంచి, న్యూడ్ మేకప్‌తో లుక్‌ను పూర్తి చేయండి.

**ప్లెయిన్ రెడ్ డ్రెస్**

వాలెంటైన్స్ డే రోజున రెడ్ కలర్ డ్రెస్ అద్భుతంగా ఉంటుంది. దీన్ని మీరు ఓపెన్ హెయిర్, న్యూడ్ మేకప్‌తో స్టైల్ చేయవచ్చు. ఈ రకమైన డ్రెస్‌ను స్టడ్ ఈయర్ రింగ్స్, హై హీల్స్‌తో జత చేయండి. స్టైల్ కోసం స్లింగ్ బ్యాగ్ కూడా తీసుకోవచ్చు.





# పాలకులే యమకింకరులు..

**గుండా, రౌడీ, రేపిస్ట్ మర్డర్... చేసినవారే రాజకీయానికి అర్హులు..!? అనే అంతగా నేడు ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసుల విషయంపై గౌరవ సుప్రీం కోర్ట్ అసహనం వ్యక్తం చేస్తూ తీర్పునిచ్చింది.. ఇదే విషయంపై "జయభేరి" సీనియర్ జర్నలిస్ట్ కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్ రాజకీయ సమగ్ర విశ్లేషణ...**

**జయభేరి, హైదరాబాద్ :**

రాజకీయంలోకి రావాలంటే ఎన్ని మర్డర్లు చేశావు!? ఎంత ఆర్థిక నేరాలకు పాల్పడ్డావు? ఎంత వెనుకేసుకున్నావు? ఎన్ని కేసులు నీ మీద ఉన్నాయి ?అనే విషయాలపై ఆరా తీసిన తర్వాతనే గుండాలకు, రౌడీలకే రాజకీయ పార్టీలు టికెట్లు ఇస్తూ ప్రజా పాలకులే యమకింకరులుగా మారేలా చేస్తున్నయి.. ఇది నేను అంటున్న మాట కాదు. న్యాయస్థానాలు గగ్గోలు పెడుతున్నాయి.. నిజానికి ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు ఉన్నవాళ్లు రౌడీయిజం చేసేవాళ్లు జనవరి నాటికి 4732 కేసులు ఉన్నట్టుగా ఈనాటి ప్రజాప్రతినిధులపై సుప్రీం తీర్పునిస్తూ నిర్ఘాంతపోయింది. దీనికి ప్రధాన కారణం సుప్రీంకోర్టు అనేక పర్యాయాలు న్యాయస్థానాల విచారణ ఎలాంటి ఒత్తిడి లేకుండా జరగాలని ఎలాంటి క్రిమినల్ కేసులు లేని వాళ్ళు ప్రజాస్వామ్యంలో నాయకులు రావాలని పదేపదే చెప్పిన అవి పెడచెవిన పెట్టేలా సమాజంలో రాజకీయాలు విష వలయంలో చిక్కి పోతుంది. దోచుకోవడం వెనకేసుకోవడం జనాలకి అమలు కానీ హామీలను అందివ్వడం నేరచరిత్ర ఉన్నవాళ్లు రాజకీయాల వైపు మొగ్గు చూపడం, లక్షల కోట్ల రూపాయలు వెనకేసుకోవడం రాజకీయం ఒక వ్యాపారంగా మారిపోయింది. నిజానికి లోక్‌సత్తా అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ ఐఏఎస్ చేసిన విశేష కృషికి గాను రాజకీయ నాయకులు ప్రజాప్రతినిధులుగా అఫడ ఫిట్ జారీ చేసేటప్పుడు తమ నేర చరిత్రపై పూర్తి వివరణ అఫడ ఫిట్‌లో పెట్టాలని సుప్రీంకోర్టు ఆనాడు తీర్పించింది. ప్రతి ఒక్క రాజకీయ నాయకుడు తమ తమ అఫడ ఫిట్లలో కచ్చితంగా తమ నేర చరిత్రను అందులో పెడుతున్నారు. కానీ ఇది ఎంతమంది ప్రజలు విజ్ఞానవంతులు యువతీ యువకులు, విద్యార్థులు ఓటర్లు చదువుతున్నారు అనేది ప్రశ్నార్థకం!? ఎన్నో ప్రజా సంఘాలు రాజకీయ నాయకులు మచ్చలేని రాజకీయం అనుభవంగా వాళ్ళు కష్టపడి ఇలాంటి చట్టాన్ని తీసుకొస్తే అది తుంగలో తొక్కేసి నేరచరిత్ర ఉన్నవాళ్లే రాజకీయంలో మనుగడ సాగించవచ్చు అన్న విధంగా నేటి ప్రజాప్రతినిధులు రాజకీయంలో పరిపాలన పగ్గాలు చేతపట్టుకుంటున్నారు. ఇది ముమ్మాటికి ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేయడమే. రౌడీలు గుండాలు నేరచరిత్ర కల వాళ్ళు రాజకీయంలో వస్తే ప్రజల బాగును ఏం చూస్తారు? వారి లాభం కోసం వారి వ్యాపారాల కోసం వారి ఆర్థిక నేరాలు బయటికి రాకుండా ఉండడం కోసం రాజకీయంలో అధికారాన్ని దక్కించుకొని చట్టాన్ని కోర్టులలో ఉన్న వాటిని కూడా తమ వైపు తిప్పుకోవడం కోసం ఇలాంటి రాజకీయ అధికారాన్ని చేత పట్టుకుంటారు...

**2009లో 30% 2014లో 43% నేరాలు కిడ్నాప్లు మర్డర్లు ఉన్న నాయకులు రాజకీయాల్లో బయటకు వచ్చినట్టుగా అనేక సర్వేలు చెబుతున్నాయి. ఒక మాటలో చెప్పాలంటే రాజకీయం అంటే నేరాలకు రౌడీయిజానికి ఆర్థిక దోపిడీకి లైసెన్సు తీసుకోవడం అన్నట్టుగా మారిపోతుంది. దీనికి తోడు ఒక ఎమ్మెల్యేగా ఎన్నుకోబడ్డాడు అంటే వెంటనే జిల్లా స్థాయిలో మండల స్థాయిలో పూర్తిగా పోలీసు వ్యవస్థను తన కంట్రోల్లో పెట్టుకునేందుకు మొదలు కుట్రలు పన్నుతాడు... తన మండలంలో ఉండే ఎస్ఐ సీఐ వాళ్లను తన కంట్రోల్ లో పెట్టుకొని స్థానికంగా భూ దోపిడీకి ఎగబడుతూ లీగల్ పనులను పక్కనపెట్టి ఇల్లీగల్ కు తెర లేపుకోవడానికి పోలీసు వ్యవస్థను వాడుకుంటున్నారు.. నిజానికి పోలీసు వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి అవసరం.. రాజకీయ నాయకులు చేతిలో కీలుబొమ్మలుగా మారే దుస్థితికి దాపురించింది అంటే రాజకీయం ఎంత నీచాతి నీచంగా మారిపోయిందో మనం అర్థం చేసుకోవచ్చు..**

వాస్తవానికి సెక్షన్ 346 ప్రకారంగా ప్రజా ప్రతినిధుల పై నేరచరిత్ర ఉన్నట్లయితే ప్రతిరోజు వారు విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుంది... కానీ ఇది ఈనాటి పాలకొల్లు ప్రతిపక్ష నాయకుల్లో ఇది కనిపిస్తోందా..!? కొంతమంది రాజకీయ నాయకులు అత్యాచారాల్లో నేర చరిత్ర ఉన్నప్పటికీ వారు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి మరల అధికారాన్ని సంపాదించుకొని కసిని తీర్చుకుంటారు... అంటే కోర్టు ధ్రువీకరించి శిక్ష వేసి నేరస్తుడిగా పరిగణించి జైలు శిక్ష అనుభవించిన తిరిగి ప్రజాక్షేత్రంలో నాయకుడిగా నిలిచి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ఆర్థిక ప్రలోభాలకు ఎరచూపి మళ్లీ అధికారాన్ని దక్కించుకొని తమపై ఉన్న కేసులను పూర్తిగా తొలగించుకునేందుకు ప్రయత్నాలు చేయడం ఒక అలవాటుగా మారిపోయింది.. ఇక పోలీసు వ్యవస్థ విచారణ సంస్థలు ఈ రెండు వేరు వేరుగా స్వయం ప్రతిపత్తితో పని చేయాలి.. విచారణ వ్యవస్థలు అనగా ఈ డి సి బి ఐ ఇలాంటి స్వయం ప్రతిపత్తి గల విచారణ సంస్థలు రాజకీయ అధికారం చెప్పు చేతల్లో పనిచేయడం ప్రజాస్వామ్యం పూర్తిగా దెబ్బతిని పోయిందని చెప్పనవసరం లేదు.. ఇదంతా ప్రజలకు తెలియదా.. కానీ మౌనంగా ఉంటారు.. ఎందుకంటే తమదాకా వస్తే కానీ తెలియదు ఆ బాధ ఆ శిక్ష.... చదువుకున్న వారు వ్యక్తులు మేధావులు మౌనం దాలిస్తే ఈ సమాజానికి అంతకంటే చేటు మరొకటి లేదు అనే నగ్న సత్యాన్ని కూడా మరిచిపోయి ప్రజలు మౌనంగా ఉంటే ఇలాంటి నాయకులు పుట్టగొడుగుల పుట్టుకొస్తూనే ఉంటారు. ప్రజల్లో తిరుగుబాటుతను రాకపోతే ఇలాంటి మతతత్వ పార్టీలు దేశ సమగ్రతకు ముప్పును వాటిల్లు ఎలా చేస్తాయి. సమాజంలో కులం మతం విద్వేషాలను రెచ్చగొట్టి ఒక కులంలో వర్గీకరణ పేరుతో విద్వేషాలు విభేదాలు కలిగించి ఒక మార్గం వారికి ఉన్నత స్థానం కల్పించడం ఇంకొక వర్గాన్ని తప్పుదోవ పట్టించడం సమాజంలో మీడియా సైతం తమ వక్రబుద్ధిని చూపించుకుంటున్నాయి...



**కడారి శ్రీనివాస్**
**సీనియర్ జర్నలిస్ట్, పొలిటికల్ ఎనలిసిస్టు, కవి, రచయిత, గాయకుడు, సామాజిక ఉద్యమకారుడు**

**స్వతంత్రంగా పని చేయాల్సిన పోలీసు వ్యవస్థ పూర్తిగా రాజకీయ విషం వలయంలో చిక్కుకుపోతోంది.. ఇక ఉన్నతమైన న్యాయవ్యవస్థ కూడా రాజకీయ నాయకుల చెప్పు చేతల్లో న్యాయం బంధి కాబడుతోంది... ఒక నిర్దోషికి న్యాయం సరియైన టైం లో అందకపోతే అతనికి ఆలస్యంగా న్యాయం జరిగిన అది అన్యాయం కింద పరిగణించవచ్చు అని గౌరవ కోర్టులు తీర్పు చెప్పినప్పటికీ సమాజంలో ఈ దుస్థితి తీరు మారటం లేదు.. ఒక మాటలో చెప్పాలంటే ఆలస్యంగా అందిన న్యాయం అన్యాయంతో సమానం. ఏ సంస్థలు ఎలా పని చేయాలి? ఎప్పుడు న్యాయం నాలుగు కాళ్ల మీద నడుస్తుంది అనే ప్రశ్న సంధిస్తే... ఇక ఆయా రాష్ట్రాల్లో దేశంలో సరిపడా న్యాయమూర్తుల సంఖ్య లేకపోవడం ప్రధానంగా దోషులను ఎక్కడికక్కడ చెరసాలలో పెట్టడానికి వీలు కాకపోవడం ఒక ప్రధాన సమస్యగా చెప్పుకోవచ్చు. అలాగే విచారణ జరిపే సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తి లేకపోవడం వలన రాజకీయ అధికారం చేతుల్లో నలిగిపోతుండడం ఏదో ఒక కారణంగా చెప్పుకోవచ్చు. పోలీసు వ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థగా పని చేయాలి. అలాగే న్యాయవ్యవస్థకు బడ్జెట్లో సరైన కేటాయింపులు జరగాలి. ఇలా చేసినప్పుడు కచ్చితంగా క్రిమినల్స్ అయినా ప్రజాప్రతినిధులపై వెంటనే చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆయా కోర్టులో ఏండ్లకొద్దీ ఉన్న సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంటుంది. లా కమిషన్ ప్రకారం విచారణ సంస్థలు న్యాయవ్యవస్థలు ప్రజాప్రతినిధులను దోషిగా నిర్ధారించిన తర్వాత కచ్చితంగా వారిని ఎన్నికల్లో పోటీ చేయకుండా చేయాలని తీర్పును ఇచ్చింది. కానీ అది అమలు జరుగుతుందా...!?**

స్థానిక రాజకీయ నాయకుల స్వార్థ బుద్ధికి పవిత్రమైన న్యాయవ్యవస్థ అలాగే పోలీసు వ్యవస్థ విచారణ వ్యవస్థలు పూర్తిగా వాటి అర్హతను కోల్పోతున్నాయి.. ఇది ముమ్మాటికి సమంజసం కాదు.. ఒక్కసారిగా సమాజం మారిపోవాలంటే మారిపోదు.. ప్రజలందరూ ప్రజాప్రతినిధులు ఎలా ఉండాలో నిర్ధారించుకొని ఎవరికి ఓటెయ్యాలో తెలుసుకొని ఓటును సరిగ్గా వినియోగించుకున్నప్పుడు ఇలాంటి నేరచరిత్ర ఉన్న రాజకీయ నాయకులు పాలకులుగా ఉండరు.. ఇక పోలీసు వ్యవస్థ విచారణ వ్యవస్థలు స్వతంత్ర ప్రతిపత్తి గల వ్యవస్థలుగా పని చేసినప్పుడు ఇలాంటి నేర చరిత్ర గల ప్రజాప్రతినిధులు మనుగడ ప్రశ్నార్థకం కాక మానదు.. ఏది ఏమైనా ప్రజలు వేసే ఓటుతోనే ఇలాంటి సమస్యలను అన్ని పరిష్కరించవచ్చనేది ఎవరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. ఇదే నిజం ఇదే పచ్చి నిజం...

# బీరు బాటిల్‌పై రూ.10 వడ్డన..




**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 11:**

ఫిబ్రవరిలోనే ఎండలు మండుతున్నాయి. పగటి ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలకుపైగా నమోదువుతున్నాయి. విద్యుత్ వినియోగంపెరిగింది. ఇలాంటి తరుణంలో మందు బాబులు చల్లటి బీర్లు కోరుకుంటున్నారు. ఈ క్రమంలోనె రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు షాక్ ఇచ్చాయి. మద్యం ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి.వాతావరణంలో మార్పులతో ఈసారి ఫిబ్రవరిలోనే భానుడు భగ్గుమంటున్నాడు. వేడి, ఉక్కపోత పెరుగుతోంది. దీంతో ఫ్యాన్లు, కూలర్ల వినియోగం పెరిగింది. ఈ తరుణంలో శీతల పానీయాల అమ్మకాలూ ఊపందుకున్నాయి. ఇక మందుబాబులు చల్లని బీర్లు కోరుకుంటున్నారు. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలుమందు బాబులకు షాక్ ఇచ్చాయి. ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఏపీలో రూ.99 అమ్మే బ్రాండ్, బీరు మినహా మిగతా అన్ని రకాల మద్యం బ్రాండ్ల ధరలను పెంచింది ఎక్సైజ్ శాఖ, విదేశీ తయారీ మద్యం, విదేశీ మద్యంపై అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ విధించనుంది. రిటైల్ విక్రయాల మార్జిన్‌ను ఇటీవల 14.5 శాతం నుంచి 20 శాతానికి పెంచిన ప్రభుత్వం తాజాగా మళ్లీ పెంచింది. తాజాగా ఏపీలో మద్యం ధరలు ప్రతీ బాటిల్‌పై రూ.10 పెంచినట్లు ఎక్సైజ్ శాఖమిషనర్ నిశాంత్‌కుమార్‌తెలిపారు. ధర రూ.15 నుంచి రూ.20 వరకు పెరిగినట్లు జరుగుతున్న అసత్య ప్రచారం నమ్మొద్దని కోరారు. బాండ్, సైజ్‌తో సంబంధం లేకుండా ప్రతీ బాటిల్‌పై రూ.10 పెంచినట్లు పేర్కొన్నారు. రూ.99 లిక్కర్, బీర్ల ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదని వెల్లడించారు. కొత్త ధరలను మద్యం షాపులన్నీ ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ పెంపు నుంచి అమలులోకి వస్తాయని తెలిపారు.ఇక తెలంగాణలో బీర్ల ధరలు పెంచుతూ ఎక్సైజ్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ధరలు పెంచాలని తయారీ కంపెనీలు ఎప్పటి నుంచో కోరుతున్నాయి. అయితే గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా ఏడాదిగా వాయిదా వేస్తూ వచ్చాయి. చివరకు ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. బీర్లపై 15 శాతం ధరలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. పెరిగిన ధరలు మంగళవారం (ఫిబ్రవరి 11)నుంచే అమలులోకి వస్తాయి. జస్టిస్ జైస్వాల్ కమిటీ సిఫారసుల మేరకు ధరలు పెంచారు. దీంతో రేపటి నుంచి అన్ని బ్రాండ్ల బీర్ల ధరలు 15 శాతం పెరగనున్నాయి.




# అల్లు అర్జున్ కొత్త సినిమాపై సస్పెన్స్..

'పుష్ప 2' తో భారీ విజయాన్ని అందించిన అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాలను చాలా జాగ్రత్తగా ఎంచుకుంటున్నాడు. అల్లు అర్జున్ తన తదుపరి సినిమాను త్రివిక్రమ్ తో చేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు, అల్లు అర్జున్ మరో హిట్ దర్శకుడితో చేతులు కలపనున్నారు. ఇప్పటికే ఖాన్‌లతో కలిసి పనిచేస్తున్న దక్షిణాది స్టార్ దర్శకుడితో బన్నీ నటిస్తున్నాడు. వరుస పరాజయాల్లో ఉన్న షారుఖ్ ఖాన్ కు 'జవాన్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన తమిళ దర్శకుడు అట్లీ ఇప్పుడు అల్లు అర్జున్ తో సినిమా చేయనున్నాడు. సల్మాన్ ఖాన్ కోసం అట్లీ ఒక సినిమా దర్శకత్వం వహించనున్నారు. ఆ సినిమా తర్వాత దర్శకుడు అట్లీ అల్లు అర్జున్ కోసం ఒక సినిమా తీస్తాడు. అట్లీ తమిళ దర్శకుడే అయినప్పటికీ, బాలీవుడ్‌లో వరుసగా సినిమాలకు దర్శకత్వం వహిస్తున్నాడు. బ్లాక్ బస్టర్ మూవీ 'జవాన్' తర్వాత, అట్లీ వరుణ్ ధావన్, కీర్తి సురేష్ జంటగా 'బేబీ' అనే చిత్రానికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఆ తర్వాత సల్మాన్ ఖాన్ తో సినిమా చేస్తానని అట్లీ అన్నాడు. సల్మాన్ ఖాన్ ప్రస్తుతం 'సికంధర్' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు.ఈ సినిమా తర్వాత అట్లీతో సినిమా షూటింగ్ ప్రారంభిస్తాడు. అల్లు అర్జున్ త్వరలో త్రివిక్రమ్ దర్శకత్వంలో కొత్త చిత్రంలో నటించనున్నాడు. ఆ సినిమా తర్వాత, ఆయన బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహించే కొత్త చిత్రంలో నటించనున్నారు. ఈ రెండు సినిమాల తర్వాతే అల్లు అర్జున్, అట్లీ కాంబినేషన్ సినిమా సెట్ అవుతుంది. 2019లో వచ్చిన 'బిగిల్' సినిమా తర్వాత అట్లీ ఏ సౌత్ సినిమాకూ దర్శకత్వం వహించలేదు. అల్లు అర్జున్ సినిమా ద్వారా అట్లీ దక్షిణ భారత చిత్ర పరిశ్రమకు తిరిగి రానున్నారు. కాగా ఈ చిత్రానికి యువ సంగీత స్వరకర్త సాయి అభయంక సంగీతం సమకూరుస్తారని టాక్ వినిపిస్తుంది. అతను మరెవరో కాదు ప్రముఖ గాయకుడు టిప్పు కుమారుడు.

# పొలిటికల్ రీఎంట్రీపై చిరంజీవి సంచలన ప్రకటన..




బ్రహ్మానందం, ఆయన కుమారుడు రాజా గౌతమ్ నటించిన చిత్రం 'బ్రహ్మ ఆనందం'. ప్రియ వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్, వెన్నెల కిశోర్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఫిబ్రవరి 14న న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రమోషన్లలో భాగంగా మంగళవారం (ఫిబ్రవరి 11) బ్రహ్మ ఆనందం ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించారు. మెగాస్టార చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై చిత్రం పెద్ద విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇదే సందర్భంగా తన పొలిటికల్ రీ ఎంట్రీపై వస్తోన్న ఊహాగానాలను కొట్టిపారేశారు. 'నేను రాజకీయాల వైపు మళ్లీ వెళ్తానేమోనని పలువురు అనుకుంటున్నారు. 'పెద్ద పెద్ద వారిని కలుస్తున్నాడు. ఏంటీ? అటువైపు ఏమైనా వెళ్తాడా?' అని కొందరు సందేహపడుతున్నారు. అలాంటి డౌట్స్ పెట్టుకోవద్దు. జీవితాంతం కళామతల్లి సేవలోనే ఉంటాను. సినీరంగానికి సేవల కోసమే రాజకీయ పెద్దలను కలుస్తున్నాను. అంతకుమించి ఏమీ లేదు. రాజకీయంగా నేను అనుకున్న లక్ష్యాలు, సేవలు నెరవేర్చేందుకు నా సోదరుడు, జన సేన అధినేత పవన్ కల్యాణ్ ఉన్నారు. జీవితాంతం రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలకు అతి దగ్గరగా ఉంటా' అని కుండబద్దలు కొట్టేశారు చిరంజీవి.



# గ్లామర్‌తో చంపేస్తున్న వెంకటేష్ గర్ల్ ఫ్రెండ్..

హీరోయిన్ మీనాక్షి చౌదరి ఇచ్చట వాహనములు నిలపరాదు సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పర్వాలేదనిపించినా అమ్మడు నటనకు మాత్రం మంచి మార్కులే పడ్డాయని చెప్పవచ్చు. దీంతో తర్వాత రవితేజ ఖిలాడి సినిమాలో ఆఫర్ రావడంతో ఒకే చెప్పేసిన ఈ బ్యూటీ, ఈ మూవీలో తన నటన, గ్లామర్‌తో తెలుగు అభిమానులను ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. తర్వాత హిట్ ది సెకండ్, గుంటూరు కారం, లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాకీ , సంక్రాంతికి వస్తున్నాం వంటి సినిమాల్లో నించి మెప్పించింది. ముఖ్యంగా లక్కీ భాస్కర్, సంక్రాంతికి వస్తున్నాం వంటీ సినిమాలతో వరసగా బ్లాక్ బస్టర్ హిట్స్ తన ఖాతాలో వేసుకుంది ఈ ముద్దుగుమ్మ. విక్టరీ వెంకటేష్, అనిల్ రావుపూడి దర్శకత్వంలో తెరకెక్కిన సక్రాంతికి వస్తున్నాం సినిమాలో వెంకటేష్ గర్ల్ ఫ్రెండ్‌గా తన నటనతో వావ్ అనిపించుకుంది. ఈ సినిమాలో ఈ అమ్మడుకు మంచి మార్కులే పడ్డాయి. దీంతో మీనాక్షి చౌదరికీ వరసగా ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ అమ్మడు చేతులో అరడజన్ సినిమాలు ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే సక్సెస్ జోష్‌లో ఉన్న ఈ ముద్దుగుమ్మ వరస ఫొటోషూట్‌తో కుర్రకారును మాయ చేస్తుంది. తాజాగా ఈ బ్యూటీ ఆరెంజ్ కలర్ డ్రెస్‌లో తన గ్లామర్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



# కాజల్‌కు తప్పని కష్టాలు..

కాజల్ అగర్వాల్‌పై కష్టాలన్నీ కలిసి ఒకేసారి అటాక్ చేస్తున్నాయి. ఎప్పుడూ బిజీగా ఉన్నట్లే కనిపిస్తుంది కానీ చేతిలో ఒక్క సినిమా కూడా ఉండదు. కమిటైన సినిమాల్లోంచి కూడా ఈమెను తప్పిస్తున్నారు. రిలీజైన సినిమాల్లో కాజల్ కనిపించట్లేదు. గత మూడేళ్లుగా ఇదే సిచ్యువేషన్‌లో ఉన్నారు ఈ సీనియర్ బ్యూటీ. ఆచార్య నుంచే కాజల్ బ్యాడ్‌లక్ మొదలైంది. అందులో కథకు కాజల్ క్యారెక్టర్ అక్కర్లేదని.. షూటింగ్ చేసాక తప్పించారు కొరటాల శివ. ఆ తర్వాత నాగార్జున ఘోస్ట్ సినిమాలోనూ హీరోయిన్‌గా తీసుకుని.. తర్వాత తప్పించారు. ఇక భగవంత్ కేసరిలో ఉన్నా.. కాజల్ పాత్రకు పెద్దగా వెయిటేజ్ ఉండదు. అంతా బాలయ్య, శ్రీలీలే చూసుకున్నారు. ఇండియన్ 2తో అయినా జాతకం మారుతుందేమో అనుకుంటే.. అందులో అసలు కాజల్ కనిపించనే లేదు. పార్ట్ 3లోకి పార్సల్ చేసారు శంకర్. కానీ పార్ట్ 2 ఫలితం చూసాక ఇండియన్ 3 వచ్చేది అనుమానమే. దాంతో అక్కడ కూడా కాజల్‌కు కష్టాలు తప్పలేదు. ప్రస్తుతం కన్నప్పలో పార్వతిగా నటిస్తున్నారు కాజల్. మొత్తంగా సీనియర్ హీరోలంతా కలిసి కాజల్‌కు షాకిచ్చారు.



# దేవుడు ఆమెకు అన్నీ ఇచ్చాడు..

ప్రియాంక చోప్రా.. ఈ అమ్మడు ఎప్పుడూ వార్తల్లో ఉంటుంది. బాలీవుడ్ నుంచి హాలీవుడ్ వరకు వెళ్ళింది ఈ అమ్మడు. ప్రియాంక నటించిన 'సిటాడెల్' సినిమా రీసెంట్ గా విడుదలైంది. హీరోలతో సమానంగా రెమ్యునరేషన్ అందుకుంటూ దూసుకుపోతుంది ఈ చిన్నది. ప్రస్తుతం ప్రియాంక సూపర్ స్టార్ మహేష్ బాబు, రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా కోసం రెడీ అవుతుంది. అమెరికాలో సెటిల్ అయిన ప్రియాంక ఇటీవలే ఇండియాకు వచ్చింది. గతంలో ప్రియాంక చోప్రా బాలీవుడ్ లో సినిమాలు చేయడం ఆపేస్తాను అంటా ప్రకటించింది. గతంలో బాలీవుడ్ ఇండస్ట్రీలో రాజకీయాలను ప్రియాంక చోప్రా ఆమధ్య బయటపెట్టింది. బాలీవుడ్ రాజకీయాలతో తాను విసుగు చెందానని, ఆఫర్స్ రావడం కష్టమని ప్రియాంక చెప్పింది. ప్రియాంక చోప్రా బాలీవుడ్‌ను విడిచిపెట్టడానికి ఇదే కారణం అని సి హెప్పింది. ప్రియాంక చోప్రా ఈ విషయాన్ని వెల్లడించిన తర్వాత, షెర్లిన్ చోప్రా ప్రియాంకను విమర్శించింది. ప్రియాంక చోప్రాకు బాలీవుడ్‌లో ఆఫర్స్ రావడం లేదని చేసిన కామెంట్స్ షెర్లిన్ చోప్రా మాట్లాడుతూ.. 'ఆమెకు ఆఫర్స్ రావడం లేదని నేను అనుకోను. ప్రియాంక షారుఖ్ ఖాన్, కరణ్ జోహార్, అక్షయ్ కుమార్ వంటి అనేక మంది పెద్ద నటులతో కలిసి పనిచేసింది. అతనికి ఒకరు కాదు, చాలా మంది నిర్మాతలు, దర్శకులు చాలా అవకాశాలు ఇచ్చారు. ప్రియాంక తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్లడానికి ఈ అవకాశాలన్నింటినీ ఉపయోగించుకుంది, కాబట్టి ఆమె ఈ విషయాలకు బాలీవుడ్‌కు కృతజ్ఞతలు చెప్పాలి' అని షెర్లిన్ అన్నారు. షెర్లిన్ చోప్రా అక్కడితో ఆగలేదు. 'దేవుడు ఆమెకు అన్నీ ఇచ్చాడు, ఆమె అసంతృప్తి చెందడానికి ఎటువంటి కారణం లేదు.' ఇప్పుడు బాలీవుడ్ ఆమెకు పని ఇవ్వలేదని చెప్పడం తప్పు. ప్రియాంక చాలా మంది పెద్ద నటులతో కలిసి పనిచేసింది అలాగే చాలా గొప్ప చిత్రాలను చేసింది. నేను అలా చెబితే, ఈ విషయాలు నాకు వర్తిస్తాయి. "ప్రజలు నా మాటలను నమ్మవచ్చు, కానీ ప్రియాంక ఇప్పుడు ఇవన్నీ చెప్పడం సరైనది కాదు" అని షెర్లిన్ అన్నారు. మహేష్ బాబు నటిస్తున్న కొత్త చిత్రానికి రాజమౌళి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాపై చాలా అంచనాలు ఉన్నాయి. చాలా సంవత్సరాల తర్వాత ప్రియాంక ఈ సినిమా కోసం ఇండియాకు తిరిగి వచ్చింది. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతుంది. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని తెలుస్తుంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com